


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 308 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 10 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :308 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE FRI 10 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## హెచ్ఐవీ కట్టడికి కొత్త వ్యాక్సిన్... ప్రయోగాల్లో అద్భుత ఫలితాలు!

- హెచ్ఐవీ వ్యాక్సిన్ అభివృద్ధిలో కీలక ముందడుగు
- జంతువులపై జరిపిన ప్రయోగాల్లో అద్భుత ఫలితాలు
- వైరస్‌ను ఎదుర్కొనే శక్తివంతమైన యాంటీబాడీల ఉత్పత్తి
- మనుషులపై క్లినికల్ ట్రయల్స్ దశకు చేరుకున్న పరిశోధనలు

పెన్ పవర్ డెస్క్: హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణలో దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న వ్యాక్సిన్ దిశగా శాస్త్రవేత్తలు కీలక పురోగతి సాధించారు. ప్రయోగాత్మకంగా అభివృద్ధి చేసిన ఒక కొత్త వ్యాక్సిన్, కోతుల వంటి ప్రైమేట్లపై జరిపిన పరీక్షల్లో అద్భుతమైన ఫలితాలను ఇచ్చింది.

- మిగతా 2లో



## ‘ఆస్ట్రేలియాకు మోదీ నిజమైన మిత్రుడు’.. ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్

- మెల్‌బోర్న్‌లో భారతీయుల సభలో ప్రశంసలు
- భారత్‌తో బంధం మరింత బలపడిందన్న వ్యాఖ్యలు
- 2023 అహ్మదాబాద్ పర్యటనను గుర్తు చేసిన ఆల్బనీస్
- క్లిష్ట పరిస్థితుల్లో ముందు స్పందించేది భారతీయులేనని కితాబు
- భారతీయుల వల్ల ఆస్ట్రేలియా బలమైన దేశంగా మారిందని వ్యాఖ్య

- మిగతా 2లో





## ధాన్యం కొనుగోలులో రికార్డు సృష్టించాం

- రైతులు, రైస్ మిల్లర్లతో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సెమినార్
- రెండో ఏడాది 74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్న మనోహర్
- 95 శాతం చెల్లింపులను 24 గంటల్లో పూర్తి చేశామన్న మంత్రి

పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తి కావడంతో విజయవాడలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలు

- మిగతా 2లో




నంద్యాల జిల్లాలో దశాబ్దాలుగా నలుగుతున్న క్లిష్టమైన భూ సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన పర్యటనలోనే తక్షణ పరిష్కారం చూపారు. బేతంచర్ల మండలం గుటుపల్లి గ్రామానికి చెందిన 897 మంది రైతుల 2,074 ఎకరాల భూములను నిషేధిత 22ఏ జాబితా నుంచి విముక్తి కల్పించారు. కేవలం హామీ ఇవ్వడమే కాకుండా, బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయంలోనే అధికారుల సమక్షంలో మొత్తం ప్రక్రియను దగ్గరుండి పూర్తి చేయించి, రైతులకు విముక్తి పత్రాలను అందజేశారు. గురువారం నంద్యాల జిల్లాలో పర్యటించిన సీఎం, ‘మీ భూమి–మీ హక్కు’ కార్యక్రమంలో భాగంగా ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు.

- మిగతా 2లో

## ఏపీలో కారుణ్య మరణంపై స్పష్టత.. అమల్లోకి కొత్త నిబంధనలు

- కారుణ్య మరణంపై మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా నిబంధనలు
- ‘లివింగ్ విల్’ ద్వారా చికిత్సపై ముందుగానే నిర్ణయం తీసుకునే అవకాశం
- రెండు దశల మెడికల్ బోర్డుల పరిశీలన తర్వాతే అమలుకు అనుమతి



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో నిష్క్రియాత్మక కారుణ్య మరణం (ప్యాసివ్ యూథనేషియా) అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. కోలుకునే అవకాశం లేని వ్యాధులతో బాధపడుతున్న రోగులకు జీవనాధార

- మిగతా 2లో



## ఇది నా ఆత్మగౌరవం మీద దాడి... ప్రాణం ఉన్నంతవరకు ప్రకాశ్ రెడ్డిని వెంటాడుతూనే ఉంటా

- వైసీపీ నేత తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిపై టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తీవ్రస్థాయిలో ధ్వజం
- ఇది తన ఆత్మగౌరవానికి, ప్రకాశ్ రెడ్డి అహంకారానికి మధ్య జరుగుతున్న యుద్ధమని వ్యాఖ్య
- ప్రకాశ్ రెడ్డి సోదరుడిని కటకటాల వెనక్కి పంపే వరకు పోరాటం ఆగదని హెచ్చరిక
- తనపై చేసిన ఆరోపణలను గురువారం లోపు నిరూపించాలని ప్రకాశ్ రెడ్డికి సవాల్
- తోపుదుర్తి కుటుంబ చరిత్రపై, వారి ఆర్థిక లావాదేవీలపై సంచలన ఆరోపణలు

- మిగతా 2లో






## విశాఖలో కియాఎక్స్‌పోర్ట్ సెంటర్, శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ యూనిట్..

### కొరియాలో లోకేశ్ కీలక భేటీలు

- దక్షిణ కొరియా పర్యటనలో మంత్రి నారా లోకేశ్
- శ్రీసిటీలో యూనిట్ ఏర్పాటు చేయాలని సునిక్ సిస్టమ్స్‌కు విజ్ఞప్తి
- ఏపీలో ఈవీ హబ్, విశాఖలో ఎక్స్‌పోర్ట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కియాకు ప్రతిపాదన
- కొరియా ఉపమంత్రితో భేటీ.. ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్ ఏర్పాటుకు విజ్ఞప్తి

- మిగతా 2లో

## పోక్సో కేసు: బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

- దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని హైకోర్టు ఆదేశం
- 45 రోజులకు పైగా జైల్లో ఉన్న బండి భగీరథ్
- త్వరలో చార్జిషీట్ దాఖలు చేయనున్న పోలీసులు



పెన్ పవర్ డెస్క్: కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. పోక్సో చట్టం కింద నమోదైన కేసులో అతడికి గురువారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు

- మిగతా 2లో

## రాజ్యసభ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా వద్దిరాజు రవిచంద్ర

- ఫ్లోర్ లీడర్‌గా ముగిసిన సురేశ్ రెడ్డి పదవీకాలం
- ఆ స్థానంలో రవిచంద్రను నియమించిన కేసీఆర్
- కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపిన మున్నూరు కాపు సంఘం

పెన్ పవర్ డెస్క్:రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న సురేశ్ రెడ్డి పదవీకాలం ముగియడంతో, ఆయన స్థానంలో ప్రస్తుత డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్రను ఫ్లోర్ లీడర్‌గా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నియమించారు. పార్టీ కోసం వద్దిరాజు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# బీజేపీకి చెక్ పెట్టేందుకే పీకే ప్లాన్

తెరవెనుక ఉంటూ గొప్ప పొలిటికల్ స్ట్రాటజిస్టుగా పేరు తెచ్చుకున్న ప్రశాంత్ కిషోర్ జనసురాజ్ పార్టీ పెట్టి పెద్దగా సక్సెస్ కాలేదు. కానీ ఆయన గత ఎన్నికల్లో పోటీ చేయలేదు. కానీ ఇప్పుడు తానే స్వయంగా ప్రత్యక్ష ఎన్నికల గోదాలోకి దూకారు. ఆయన స్థాపించిన జన సూరాజ్ పార్టీ కోర్ కమిటీ నిర్ణయం ప్రకారం.. బీహార్‌లోని అత్యంత హై–ప్రొఫైల్ అసెంబ్లీ స్థానమైన బాంకీపూర్ ఉపఎన్నికలో ప్రశాంత్ కిషోర్ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికై, ఇటీవల రాజ్యసభకు వెళ్లిన సీనియర్ నేత నితిన్ నబీన్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో ఈ స్థానానికి జూలై 30, 2026 న ఉపఎన్నిక జరగనుంది. గత ఏడాది జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో స్వయంగా పోటీ చేయడానికి వెనుకడుగు వేసిన పీకే.. ఇప్పుడు ఏకంగా బీజేపీకి కంచుకోట లాంటి స్థానంలో పోటీకి దిగడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.ప్రశాంత్ కిషోర్ ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక పెద్ద రాజకీయ అనివార్యత దాగి ఉంది. గత 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ అంచనాలతో 238 స్థానాల్లో పోటీ చేసిన జన సూరాజ్ పార్టీ.. ఒక్క సీటులో కూడా గెలవలేక పూర్తిగా చాపచుట్టేసింది. ఈ ఘోర పరాజయం వల్ల పీకే సృష్టించిన పొలిటికల్ హైప్ ఒక్కసారిగా కరిగిపోయింది. పార్టీ ఉనికిని కాపాడుకోవాలన్నా, కేడర్‌లో తిరిగి ఉత్సాహం నింపాలన్నా తానే స్వయంగా యుద్ధరంగంలోకి రావాలని పీకే భావించారు. అందుకే, తదుపరి సార్వత్రిక పోరు దాకా ఆగకుండా, ఈ ఉపఎన్నికను తన రాజకీయ భవితవ్యానికి ఒక యాసిడ్ టెస్ట్ గా మార్చుకున్నారు. 1990ల కాలం నుండి గతంలో పట్నా వెస్ట్ గా ఉన్న ఈ నియోజకవర్గం బీజేపీకి అల్ట్రా–సేఫ్ సీటు. నితిన్ నబీన్ ఇక్కడి నుండి వరుసగా 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పట్నా నగర పరిధిలోని అత్యంత ధనిక, విద్యావంతులైన ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో కమలం జెండాను కాదని వేరే పార్టీ గెలవడం దాదాపు అసాధ్యమనే టాక్ ఉందిఅయితే, ఇంతటి కఠినమైన నియోజకవర్గాన్ని పీకే ఎంచుకోవడం వెనుక కూడా ఒక స్ట్రాటజిస్ట్ మైండ్ దాగి ఉంది. బాంకీపూర్‌లో బీహార్‌లోనే అత్యధికంగా అక్షరాస్యత రేటు ఉంది. ఇక్కడి ఓటర్లు కుల సమీకరణాల కంటే అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్, విద్యార్హతలు చూసి ఓటు వేస్తారనే నమ్మకం పీకేకు ఉంది. బాంకీపూర్ ప్రజలు బీహార్‌లోనే అత్యంత చైతన్యవంతులు.. సరైన ప్రత్యామ్నాయం దొరికితే వారు మార్పు కోరుకుంటారు అని పీకే ఓటర్లను నేరుగా ఆకర్షిస్తున్నారు. పైగా, ఈ ఎన్నికను బీహార్ సీఎం సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ఆర్నెల్ల పాలనపై ఒక రెఫరెండం గా ఆయన అభివర్ణిస్తున్నారు. ఒకవేళ ఇక్కడ ఓడిపోయినా బీజేపీ కోటలో గట్టి ఫైట్ ఇచ్చాం అని చెప్పుకోవచ్చు, పొరపాటున గెలిస్తే మాత్రం బీహార్ రాజకీయాల్లో జన సూరాజ్ తిరుగులేని శక్తిగా అవతరిస్తుందిప్రస్తుత గెలుపు అవకాశాలను అంచనా వేస్తే.. పీకేకు ఇది అత్యంత భారీ రిస్క్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. క్షేత్రస్థాయిలో బీజేపీ ఓటు బ్యాంక్ ఇక్కడ చాలా పటిష్టంగా ఉంది. పీకే రాకతో కాంగ్రెస్ నాయకుడు రిషి మిశ్రా లాంటి వారు మద్దతు ప్రకటిస్తున్నప్పటికీ.. అధికారిక ప్రతిపక్షమైన ఆర్జేడీ – కాంగ్రెస్ కూటమి మహాగఠ్‌బంధన్ ఇక్కడ సొంత అభ్యర్థిని నిలబెడితే ఓట్లు చీలిపోయి బీజేపీకి మరింత లాభం చేకూరుతుంది. పైగా బీహార్ మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ కొత్తగా పెట్టిన జన్శక్తి జనతా దళ్ తరఫున సామాజిక కార్యకర్త వీణా మాన్వి ని బరిలోకి దించడం కమలదళానికి రూట్ క్లియర్ చేస్తోంది.ఆగస్టు 3న వచ్చే ఫలితాల్లో పీకే గనుక ఇక్కడ డిపాజిట్ కోల్పోతే.. కేవలం ఢిల్లీ ఏసీ రూముల్లో కూర్చుని స్క్రిప్టులు రాసే కార్పొరేట్ స్ట్రాటజిస్టే తప్ప, గ్రౌండ్ లెవెల్ లీడర్ కాదంటూ ప్రత్యర్థులు ఆయన్ను రాజకీయంగా సమాధి చేసే ప్రమాదం ఉంది. అలా కాకుండా బీజేపీ మెజారిటీని భారీగా తగ్గించినా, లేదా అద్భుతం జరిగి గెలిచినా.. 2025 పరాభవానికి పీకే సరైన రివెంజ్ తీర్చుకున్నట్లవుతుంది. ఈ చావో రేవో పోరాటంలో పీకే మైండ్ గేమ్ గెలుస్తుందా, లేక కమలం కోట నిలుస్తుందా అనేది బీహార్ రాజకీయాల్లో ఇప్పుడు అత్యంత ఉత్కంఠ రేపుతోంది.

# హెచ్ఐవీ కట్టడికి కొత్త వ్యాక్సిన్... ప్రయోగాల్లో అద్భుత ఫలితాలు!

- మొదటి పేజి తరువాయి

ఈ వ్యాక్సిన్ ద్వారా అత్యంత శక్తివంతమైన, విస్తృత స్థాయిలో పనిచేసే యాంటీబాడీలు ఉత్పత్తి అయినట్లు పరిశోధకులు తెలిపారు. ఈ ఫలితాలు ప్రఖ్యాత 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.ఈ వ్యాక్సిన్‌ను లా జొల్లా ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇమ్యునాలజీ, స్క్రిప్స్ రీసెర్చ్, మరియు ఇంటర్నేషనల్ ఎయిడ్స్ వ్యాక్సిన్ ఇనిషియేటివ్ సంస్థలు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఇది నేరుగా వైరస్‌పై దాడి చేసే బదులు, మన రోగనిరోధక వ్యవస్థలోని 'బి' కణాలకు దశలవారీగా శిక్షణ ఇస్తుంది. దీనివల్ల, నిరంతరం రూపాంతరం చెందే హెచ్ఐవీలోని అనేక రకాలను గుర్తించి, నిర్వీర్యం చేయగల శక్తివంతమైన యాంటీబాడీలు తయారవుతాయి.హెచ్ఐవీ తన రూపాన్ని మార్చుకుంటూ, రక్షణ కవచాలను ఏర్పరచుకోవడం వల్ల ఇప్పటివరకు వ్యాక్సిన్ అభివృద్ధి చేయడం సవాలుగా మారింది. అయితే, ఈ కొత్త విధానం ఆ అడ్డంకులను అధిగమించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. జంతువులపై ఇంతటి సానుకూల ఫలితాలు రావడం ఇదే మొదటిసారని వారు పేర్కొన్నారు.ఈ ప్రయోగాల విజయంతో, ఇదే తరహా వ్యూహాలతో మానవులపై క్లినికల్ ట్రయల్స్ కూడా ప్రారంభమయ్యాయి. అయితే, మనుషుల్లో దీని భద్రత, సమర్థతపై పూర్తిస్థాయి డేటా రావడానికి మరికొంత సమయం పడుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం హెచ్ఐవీని నియంత్రించడానికి సమర్థవంతమైన మందులు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా కొత్త ఇన్ఫెక్షన్లను అరికట్టాలంటే వ్యాక్సిన్ కీలకం. ఈ పరిశోధన ఆ దిశగా పడిన ఒక ముఖ్యమైన ముందడుగుగా భావిస్తున్నారు.

## ధాన్యం కొనుగోలులో రికార్డు సృష్టించాం

- మొదటి పేజి తరువాయి

తెచ్చామన్నారు.గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో ఏకంగా 74 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించి రికార్డు సృష్టించిందన్నారు. రూ. 31 వేల కోట్ల విలువైన ధాన్యానికి సంబంధించి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులను 24 గంటల్లోనే పూర్తి చేశామని తెలిపారు. ఏపీ తెచ్చిన '10 శాతం బ్రోకెన్ రైస్' విధానాన్ని కేంద్రం కూడా గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయనుందని చెప్పారు. క్యూఆర్ కోడ్, వాట్సాప్ బుకింగ్, మాయిశ్చర్ మీటర్ల ద్వారా కొనుగోళ్లలో పారదర్శకత పెంచామని, రానున్న సీజన్‌లో ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేలా రైతులను సన్నద్ధం చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

# 22ఏ సంకెళ్లు తెంచిన చంద్రబాబు ప్రభుత్వం... గుటుపల్లి రైతుల ఆనందం

అక్కడికక్కడే పరిష్కారం

ఈ ఏడాది మార్చి 9న డోన్ పర్యటనలో గుటుపల్లి రైతులు తమ భూములను గత ప్రభుత్వం అన్యాయంగా 22ఏ జాబితాలో చేర్చిందని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చారు. ఆ వినతిని గుర్తుంచుకున్న ముఖ్యమంత్రి, గురువారం బనగానపల్లె పర్యటనలో ఆ రైతులను ప్రత్యేకంగా తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించారు.

సమస్య పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో చర్యలు పూర్తయ్యాయని, జిల్లా స్థాయిలో ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని జిల్లా రిజిస్ట్రార్‌ను ప్రశ్నించారు. కలెక్టర్ నుంచి అధికారిక ఉత్తర్వులు అందనందున ఆన్‌లైన్ ప్రక్రియ మొదలు కాలేదని రిజిస్ట్రార్ చెప్పడంతో, సీఎం అక్కడికక్కడే కలెక్టర్‌తో మాట్లాడి ఉత్తర్వులను రిజిస్ట్రార్‌కు అందజేశారు. "త్వరలోనే పూర్తి చేస్తాం" అని అధికారి చెప్పగా, "త్వరలో కాదు, ఇప్పుడే పూర్తి చేయండి" అని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు వెంటనే రంగంలోకి దిగి, గుటుపల్లికి చెందిన 2,074 ఎకరాలను 22ఏ జాబితా నుంచి ఆన్‌లైన్‌లో తొలగించారు. ఇదే స్ఫూర్తితో బనగానపల్లె పట్టణానికి చెందిన 23 మంది రైతుల 101 ఎకరాల చుక్కల భూములను కూడా నిషేధిత జాబితా నుంచి తప్పించారు.

**రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యల పరిష్కారంపై దృష్టి**

బేతంచర్ల తరహాలోనే రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో దశాబ్దాలుగా పేరుకుపోయిన భూ వివాదాలను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తోంది. తిరుపతి జిల్లా శెట్టిపల్లి, గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు, చిత్తూరు జిల్లా కంగుంది గ్రామాల్లోని భూ సమస్యలకు ఇప్పటికే పరిష్కారం చూపింది. రీ సర్వే పేరుతో గత ప్రభుత్వం సృష్టించిన ఇబ్బందులను తొలగిస్తూ, లక్షలాది ఎకరాలకు విముక్తి కల్పిస్తోంది. ప్రభుత్వ తాజా నిర్ణయాలతో వేలాది మంది రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తూ, కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను జారీ చేయడం ద్వారా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

# చైనాలో ఘోర అగ్నిప్రమాదం.. షూ ఫ్యాక్టరీలో 28 మంది సజీవ దహనం

చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఆగ్నేయ చైనాలోని ఫుజియాన్ ప్రావిన్స్‌లో గల ఒక షూ ఫ్యాక్టరీలో గురువారం భారీ మంటలు చెలరేగడంతో 28 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. భవనంలో మరికొందరు చిక్కుకుని ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.షూ రాజధానిగా పిలిచే జిన్‌జియాంగ్ నగరంలోని హుయిటెంగ్ షూస్ ఫ్యాక్టరీలో ఈ విషాదం చోటుచేసుకుంది. బహుళ అంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగలు అలుముకున్నాయి. భవనం పైకప్పుపై చిక్కుకున్న కొందరు కార్మికులు ప్రాణరక్షణ కోసం ఆర్తనాదాలు చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే సుమారు 200 మంది అగ్నిమాపక సిబ్బంది 35 అగ్నిమాపక యంత్రాలతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.షూ తయారీలో వినియోగించే మండే స్వభావం కలిగిన ముడి పదార్థాల వల్లే మంటలు వేగంగా వ్యాపించినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ దుర్ఘటనపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇదొక భారీ ప్రాణ నష్టమని ఆవేదన వ్యక్తం చేస్తూ, సహాయక చర్యలను వేగవంతం చేయాలని, బాధితుల కుటుంబాలకు అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

# ఇది నా ఆత్మగౌరవం మీద దాడి... ప్రాణం ఉన్నంతవరకు ప్రకాశ్ రెడ్డిని వెంటాడుతూనే ఉంటా

మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, వైసీపీ నేత తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనపై నిరాధార ఆరోపణలు చేసి తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని, ఇది తనకు, ప్రకాశ్ రెడ్డికి మధ్య జీవితకాలం జరిగే యుద్ధమని ప్రకటించారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు ప్రకాశ్ రెడ్డిని రాజకీయంగా వెంటాడతానని, వదిలిపెట్టే ప్రసక్తే లేదని శపథం చేశారు. ఈ మేరకు మడకశిర టీడీపీ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.ఈ సందర్భంగా ఎంఎస్ రాజు మాట్లాడుతూ, "లేని ఆరోపణలు చేసి సమాజంలో నా గౌరవానికి భంగం కలిగించిన నిన్ను, నా ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టిన నిన్ను వదిలిపెట్టను. నీ అక్రమ ఆస్తుల దగ్గర నేనుంటా. నీ రాజకీయ పోరాటాన్ని చూస్తా. ఇది నా ఆత్మగౌరవం మీద జరిగిన దాడి. దున్నపోతు తల నరికే దొమ్మ పొగురున్న కులంలో పుట్టాను ప్రకాశ్.. భయం అనేది నాకు తెలీదు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు.తోపుదుర్తి కుటుంబ చరిత్రపై కూడా రాజు సంచలన ఆరోపణలు చేశారు. "రూ.800 కోసం లారీ డ్రైవర్‌తో తన్నులు తిన్న చరిత్ర మీ సోదరుడిది. చెప్పుల షాపులో కస్టమర్లు వదిలివెళ్లిన పాత చెప్పులు దొంగలించిన చరిత్ర మీ కుటుంబానిది. అద్దె ఇళ్లలో ఉంటూ యజమానులకు అద్దె చెల్లించకుండా వేధించిన చరిత్ర మీది. సిగ్గు లేకుండా నా గురించి మాట్లాడతారా?" అని ప్రశ్నించారు. తన ఆరాధ్య దైవం చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యుల గురించి నీచంగా మాట్లాడిన ప్రకాశ్ రెడ్డి సోదరుడు చంద్రశేఖర్ రెడ్డిని కటకటాల వెనక్కి పంపేంత వరకు తన పోరాటం ఆగదని రాజు స్పష్టం చేశారు. "నువ్వు ఎర మాత్రమే, నీ వెనక ఉన్న నీ అన్నే అసలు టార్గెట్" అని హెచ్చరించారు.తాను సామాన్య కుటుంబం నుంచి కష్టపడి ఈ స్థాయికి వచ్చానని, ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదని రాజు గుర్తుచేశారు. "టీడీపీ కార్యకర్తగా, పసుపు సైనికుడిగా ఉండటమే నాకు ఐదో పదవి. ప్రాణం ఉన్నంతవరకు పసుపు జెండా మోస్తా. చంద్రబాబు గారు నన్ను టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమిస్తే, దాన్ని ఆదాయ వనరుగా మార్చుకోలేదు. నా గదికి నేనే అద్దె కడతాను, కనీసం లడ్డూ కూడా తీసుకోను. కానీ మీరు టీటీడీని వ్యాపారంగా మార్చుకున్నారు" అని ఆరోపించారు.తనపై చేసిన ఆరోపణలను నిరూపించాలని ప్రకాశ్ రెడ్డికి రాజు సవాల్ విసిరారు. "నాకు విల్లా ఎక్కడుంది?

నా పార్టీ ఆఫీసు స్థలం ఎక్కడ? బెంగళూరులో నాకు ఆస్తులు ఎక్కడున్నాయో చూపించు. నీకు గురువారం వరకు సమయం ఇస్తున్నా. ఆరోపణలు నిరూపించు లేదా పరిణామాలకు సిద్ధంగా ఉండు" అని డిమాండ్ చేశారు. ఇది కేవలం రాజకీయ పోరాటం కాదని, తన ఆత్మగౌరవ పోరాటమని, తాను ఒక్కడినే పోరాడతానని ఎంఎస్ రాజు తేల్చిచెప్పారు.

# విశాఖలో కియాఎక్స్‌పోర్ట్ సెంటర్, శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ యూనిట్..

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఐదో రోజు (గురువారం) ఆయన పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వారికి వివరించారు.

సియోల్‌లో కియా మోటార్స్ గ్లోబల్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టే హన్ లీ, ఇతర ఉన్నతాధికారులతో లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలో ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు. ప్రపంచ మార్కెట్ల కోసం విశాఖపట్నం పోర్టు సమీపంలో ఒక సీకేడీ అసెంబ్లింగ్, ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.అంతకుముందు, సెమీకండక్టర్స్, ఓఎల్ఈడీ డిస్‌ప్లే పరికరాల తయారీ సంస్థ సునిక్ సిస్టమ్ సీఈవో ఎస్.డబ్ల్యూ. చుంగ్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో డిస్‌ప్లే పరికరాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఇందుకు ముందుకొస్తే జాయింట్ వెంచర్ ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.తన పర్యటనలో భాగంగా లోకేశ్.. దక్షిణ కొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్–హే సిసిలియా చుంగ్‌తోనూ భేటీ అయ్యారు. ఏపీలో అమలు చేస్తున్న 3ఎస్ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం కొరియా పెట్టుబడిదారులకు రక్షణ కవచంలా నిలుస్తుందని వివరించారు. ఏపీ–కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్, కొరియన్ కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో కోరారు.

## పోక్సో కేసు: బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్

- మొదటి పేజి తరువాయి

జారీ చేసింది. దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ఈ సందర్భంగా భగీరథ్‌ను హైకోర్టు ఆదేశించింది.

ఒక మైనర్ బాలికకు సంబంధించిన ఉదంతంలో మే 8వ తేదీన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైంది. ఈ కేసులో మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేయగా, అప్పటి నుంచి చర్లపల్లి జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నాడు. దాదాపు 45 రోజులుగా అతడు జైలులోనే ఉంటున్నాడు.బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా భగీరథ్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, నిందితుడు విద్యార్థి అని, జైలులో ఉండటం వల్ల చదువు నష్టపోతున్నాడని కోర్టుకు విన్నవించారు. అయితే, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెయిల్‌ను ు

వ్యతిరేకించారు. దర్యాప్తు కీలక దశలో ఉందని, నిందితుడిని విడుదల చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని వాదించారు.

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కె. సుజన భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేశారు. కాగా, తన బీబీఏ పరీక్షలకు హాజరయ్యేందుకు భగీరథ్‌కు గతంలో హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

# 'ఆస్ట్రేలియాకు మోదీ నిజమైన మిత్రుడు'..

ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ మరోసారి ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. మోదీ ఆస్ట్రేలియాకు నిజమైన మిత్రుడని, తనకు ఎంతో ఆప్తుడని అన్నారు. మెల్‌బోర్న్‌లో జరిగిన 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' కార్యక్రమంలో భారతీయులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో భారతీయులు హాజరయ్యారు. ఎన్నో చారిత్రక కార్యక్రమాలకు ఈ స్టేడియం వేదికగా నిలిచిందని, కానీ భారతీయుల ఈ సమావేశం అత్యంత ప్రత్యేకమైందని అల్బనీస్ అన్నారు. ఈ సభలో కనిపిస్తున్న ఉత్సాహమే భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న బలమైన బంధానికి నిదర్శనమని పేర్కొన్నారు.ప్రధానిగా తాను రెండుసార్లు భారత్‌లో పర్యటించే అవకాశం దక్కిందని అల్బనీస్ గుర్తు చేసుకున్నారు. భారతదేశ అందాలు, ప్రజల ఆతిథ్యం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. 2023లో అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో మోదీతో కలిసి రథంలో ప్రయాణించిన అనుభవాన్ని ఎప్పటికీ మరిచిపోలేనని అన్నారు. అప్పట్లో గుజరాత్‌లో చూసిన ఆప్యాయత, ఇప్పుడు ఈ సభలోనూ కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.భారత సంతతి ప్రజలు ఆస్ట్రేలియా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అల్బనీస్ కొనియాడారు. ఆరోగ్యం, ఐటీ వంటి రంగాల్లో తమ సేవలు అందిస్తున్నారని చెప్పారు. చిన్న వ్యాపారాల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు విద్యా రంగాన్ని కూడా బలోపేతం చేస్తున్నారని తెలిపారు. క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు ముందుగా స్పందించి సాయం చేసేది భారతీయులేనని వెల్లడించారు.భారతీయుల వల్ల ఆస్ట్రేలియా మరింత బలమైన, వైవిధ్యభరితమైన దేశంగా మారిందని అల్బనీస్ అన్నారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య బంధాన్ని మరింత బలపరిచే సజీవ వారధి భారత సంతతి ప్రజలేనని కొనియాడారు.

## ఏపీలో కారుణ్య మరణంపై స్పష్టత.. అమల్లోకి కొత్త నిబంధనలు

- మొదటి పేజి తరువాయి

వ్యవస్థలను ఉపసంహరిం చుకోవడానికి వీలు కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ జులై 8న ఈ విధివిధానాలకు అధికారికంగా ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన 'గౌరవప్రదంగా మరణించే హక్కు'కు అనుగుణంగా ఈ నిబంధనలను రూపొందించారు. ప్యాసివ్ యూథనేషియా అంటే కోలుకోలేని స్థితిలో ఉన్న రోగులకు వెంటిలేటర్లు, ఫీడింగ్ ట్యూబ్‌లు వంటి కృత్రిమ వైద్య సహాయాన్ని నిలిపివేసి, వారు సహజంగా మరణించేందుకు అనుమతించడం. ఇది భారతదేశంలో నిషేధించబడిన 'యాక్టివ్ యూథనేషియా'కు భిన్నమైనది. సుప్రీంకోర్టు 2018లో 'కామన్ కాజ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో చారిత్రాత్మక తీర్పునిస్తూ ప్యాసివ్ యూథనేషియాకు అనుమతించినప్పటికీ, రాష్ట్ర స్థాయిలో స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంతో ఇప్పటివరకు అనిశ్చితి నెలకొంది.

**మార్గదర్శకాలలోని ముఖ్యాంశాలు**

ఈ కొత్త నిబంధనల ప్రకారం, స్పృహలో ఉన్న ఏ వ్యక్తి అయినా 'అడ్వాన్స్ డైరెక్టివ్' (ముందస్తు వీలునామా) రాసుకోవచ్చు. దీని ద్వారా భవిష్యత్తులో తనకు ఎలాంటి చికిత్స అందించాలో లేదా నిలిపివేయాలో ముందుగానే నిర్ణయించుకునే అవకాశం ఉంటుంది. ఇద్దరు సాక్షుల సమక్షంలో నోటరీ లేదా గెజిటెడ్ అధికారి ద్వారా ఈ పత్రాన్ని ధృవీకరించుకోవాలి.

ఒకవేళ రోగి పరిస్థితి విషమించి, చికిత్స ఫలించదని భావిస్తే సంబంధిత ఆసుపత్రి ఒక 'ప్రైమరీ మెడికల్ బోర్డు'ను ఏర్పాటు చేయాలి. ఈ బోర్డు 48 గంటల్లోగా తన నివేదికను సమర్పిస్తుంది. వారి సిఫార్సుల అనంతరం, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్ఓ) నేతృత్వంలోని 'సెకండరీ మెడికల్ బోర్డు' తుది నిర్ణయం తీసుకుంటుంది. కుటుంబ సభ్యుల అంగీకారం, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌కు సమాచారం అందించిన తర్వాతే వైద్య సహాయాన్ని నిలిపివేస్తారు. ఈ నిబంధనల అమలును డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ సహా ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు. తాజా మార్గదర్శకాల వల్ల రోగుల కుటుంబాలపై మానసిక, ఆర్థిక భారం తగ్గడంతో పాటు, వైద్యులకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## రాజ్యసభ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా వద్దిరాజు రవిచంద్ర

- మొదటి పేజి తరువాయి

చేసిన సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతలు అప్పగించారు.ఈ నియామకం పట్ల తెలంగాణ మున్నూరు కాపు సంఘం నాయకులు పార్టీ అధినేత కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వద్దిరాజు రవిచంద్రకు ఈ ఉన్నత పదవి దక్కడం బీసీల ఎదుగుదలకు, తెలంగాణ హక్కుల సాధనకు ఎంతో కీలకంగా మారుతుందని మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం పటేల్ ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావలసిన రాజ్యాంగపరమైన నిధులు, హక్కుల సాధనలో వద్దిరాజు పార్లమెంట్‌లో మరింత సమర్థవంతంగా గళం విప్పుతారని మున్నూరు కాపు సమాజం ఆశాభావం వ్యక్తం చేసింది.

## ఈనెల 11న నెమలిగుండ్ల రంగనాయక స్వామి మాస కళ్యాణం

**గిద్దలూరు పెన్ పవర్ జూలై 9**

రాచర్ల మండలం జె పి చెరువు సమీపంలో నలమల్ల అరణ్యంలో ప్రకృతి సౌందర్యాల మధ్య కొలువై భక్తుల కొంగుబంగారమై భాసిల్లుతున్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి వారి దేవస్థానము లో ప్రతినెల రెండో శనివారం శ్రీ స్వామి వారి మాస కళ్యాణం నిర్వహిస్తారు. అదేక్రమంలో ఈ శనివారం 11న శ్రీ స్వామి వారి మాస కళ్యాణం నిర్మావశించనున్నారు. కళ్యాణంలో పాల్గొనే దంపతులు రూ.1516/- చెల్లించి తగు రసీదు పొంది సాంప్రదాయ దుస్తులతో పాల్గొనవలెనని దేవస్థానం చైర్మన్ సిద్ధం నరసింహులు, కార్యనిర్వహణాధికారి ఎం.నాగయ్య లు కోరారు.



పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం : మంత్రి గొట్టిపాటిలి





**సంతమాగులూరు, పెన్ పవర్, జూలై 9**

సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం ప్రజలకు అందుబాటులో ఉండి వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి వాటిపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తన మన అని పార్టీలతో బేదం లేకుండా అందరికీ అందుబాటులో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, అర్హులు అయిన ప్రతి సామాన్యుడికి రావాల్సిన సంక్షేమ పథకాలు కానీ వారికి సంబంధించిన సమస్యలు ఇలాంటి వాటిపై కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఒక్క వినతిని బాధ్యతగా పరిశీలించి అర్హత ఉన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని, క్షేత్రస్థాయిలో కూడా ఏవైనా ప్రజా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని, మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు...

### ప్రైవేట్ పాఠశాల బస్సులపై సంయుక్త తనిఖీలు.. ఒక బస్సు సీజ్

**పుల్లల చెరువు పెన్ పవర్ జూలై 9**

విద్యార్థుల భద్రతే లక్ష్యంగా పుల్లలచెరువు మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాల బస్సులపై గురువారం విస్తృత స్థాయిలో సంయుక్త తనిఖీలు నిర్వహించారు. మార్కాపురం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ భాస్కరరావు, పుల్లలచెరువు పోలీస్ స్టేషన్ ఎస్సై బి. సాంబశివరావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. పాఠశాలలకు చెందిన బస్సులు మోటారు వాహన శాఖ నిబంధనలను, విద్యార్థుల భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నాయా లేదా అనే అంశాలపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి బస్సుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రాలు, పన్నుల చెల్లింపు వివరాలను పరిశీలించారు. డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్సులు, బ్యాడ్జి చెల్లుబాటు, డ్రైవింగ్ అనుభవం, గతంలో ప్రమాదాల చరిత్ర వంటి వివరాలను కూడా తనిఖీ చేశారు. వాహనాల్లో అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ఎమర్జెన్సీ ఎగ్జిట్, ఎమర్జెన్సీ డోర్, భద్రతా హ్యామర్, విద్యార్థుల భద్రతకు అవసరమైన ఇతర పరికరాలు అందుబాటులో ఉన్నాయా లేదా అన్న విషయాలను అధికారులు పరిశీలించారు. అలాగే బస్సుల బ్రేకులు, టైర్ల పరిస్థితి, లైట్లు, ఇండికేటర్లు, సీట్ల అమరిక, కిటికీల భద్రత, వేగ నియంత్రణ పరికరాలు, సీసీ కెమెరాలు, జీపీఎస్ వంటి భద్రతా ఏర్పాట్లపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించారు. విద్యార్థులను తరలించే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా అన్ని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డ్రైవర్లకు సూచించారు. అధిక వేగంతో వాహనాలు నడపకూడదని,





మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని, వాహన సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించవద్దని హెచ్చరించారు. పాఠశాల యాజమాన్యాలకు కూడా విద్యార్థుల ప్రాణాల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించరాదని అధికారులు స్పష్టం చేశారు. ఫిట్‌నెస్ గడువు ముగిసిన వాహనాలను రోడ్డుపైకి తీసుకురావద్దని, అవసరమైన అన్ని ధ్రువపత్రాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. భద్రతా ప్రమాణాలను పాటించని వాహనాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఒక ప్రైవేట్ పాఠశాల బస్సును అధికారులు గుర్తించి సీజ్ చేశారు. ఆ బస్సుకు సంబంధించిన లోపాలను సరిచేసిన అనంతరం మాత్రమే రోడ్డుపైకి అనుమతిస్తామని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాల బస్సులపై ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ భాస్కరరావు, ఎస్సై బి. సాంబశివరావు తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లలు ప్రయాణించే బస్సుల్లో భద్రతా ప్రమాణాలు ఉన్నాయా లేదా గమనించి, ఏవైనా లోపాలు కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని వారు కోరారు.

## సమయం తక్కువ... సర్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి

**- అధికారులకు జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశం**

**- విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన బి ఎల్ ఓ. అడిషనల్ బి ఎల్ ఓ లను మార్చాలని సూచన**





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 09**

జిల్లా కలెక్టర్ పి. రాజబాబు ఒంగోలు పట్టణంలోని గాంధీ నగర్ వద్ద ఉన్న వార్డు సచివాలయాన్ని గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అందులో భాగంగా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బి ఎల్ వో లు చేస్తున్న ఓటర్ల నమోదు ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. ఈ.ఆర్.ఓ లు ఎంతమంది ఉన్నారు, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటరు నమోదు ప్రక్రియలో అలసత్వం వహిస్తున్న బి.ఎల్ ఓ అడిషనల్ బిఎల్ఓ పని తీరుపై అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోవాలని వేరే వారిని నియమించి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మొబైల్ యాప్ ద్వారా ఓటర్ నమోదు ప్రక్రియ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. సవరణ ప్రక్రియను త్వరితగతిన.. ఖచ్చితత్వంతో , సమర్థవంతంగా పూర్తిచేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఏ ఒక్కరు కూడా సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో మిగిలిపోకూడదని ఆయన అన్నారు. అందరికీ అవకాశం కల్పించేలా అందరి పేర్లు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకట కృష్ణయ్య, రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కేటి గ్రాండ్ న్యూ వుడ్లాండ్స్ ను ప్రారంభించిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్





**కందుకూరు, పెన్ పవర్ జూలై 9**

కందుకూరు పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన కేటి గ్రాండ్ న్యూ వుడ్ ల్యాండ్స్ హోటల్ అండ్ రెస్టారెంట్ ను గురువారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ చేతుల మీదుగా ప్రారంభించారు. న్యూ వుడ్ల్యాండ్స్ యజమానులు కృష్ణ, చిరంజీవి సోదరులకు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న కందుకూరు పట్టణానికి అనుగుణంగా కేటి గ్రాండ్ న్యూ వుడ్ల్యాండ్ హోటల్ చాలా చక్కగా ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని అన్నారు. హోటల్, రెస్టారెంట్, సూట్ రూమ్స్, ఫంక్షన్ హాల్ అన్నీ ఒకచోట ఉండేటట్లుగా ఏర్పాటు చేసిన కృష్ణ, చిరంజీవిలను ఎమ్మెల్సీ అభినందించారు. గతంలో మాదిరిగా ఖాతాదారులకు మంచి రుచిగా,శుభ్రంగా ఆహారాన్ని అందించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అంతకుముందు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కు మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం హోటల్ యాజమాన్యం ఎమ్మెల్సీ శ్రీకాంత్ కి జ్ఞాపికన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ విద్యాశాఖ డైరెక్టర్ పోకూరి రాంబాబు, పట్టణ టిడిపి అధ్యక్షులు దామాల్లేశ్వరరావు, జనసేన నాయకులు దారం మాల్యాద్రి, విపిజి సుకుమార్ గుప్తా, ఆదిత్య రెస్టారెంట్ యజమాని మర్రిపూడి శ్రీనివాసులు, ఆదిత్య ఎక్స్పోర్ట్ యజమానులు కొంజేటి రవి, అనిల్, డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, అద్దంకి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## చింతల పాలెం లో బరి తెగించిన ఇసుక మాఫియా

*తాగునీటి సరఫరా పథకానికి విఘాతం.*

*క్షేత్ర స్థాయి యంత్రాంగం చర్యలు చేపట్టాలి.*

*డి ఆర్ వో కి ఫిర్యాదు చెందిన మాజీ సర్పంచ్. గడ్డం రవీంద్ర*

**జరుగుమల్లి పెన్ పవర్, జులై 9**





ప్రభుత్వం నియంత్రణ విభాగాన్ని ఏర్పాటు చేసినా క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం ఆశ్రమానికి ఆశని పాత మయింది. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం జరుగుమల్లి మండలం లో ప్రవహిస్తున్న నదీ పరీవాహ ప్రాంతంలో యదేచ్చగా సాగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా తో చింతల పాలెం గ్రామానికి రక్షిత తాగునీటి పథకానికి ఆశని పాత మవుతుంది అని గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ గడ్డం రవీంద్ర జిల్లా రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేశారు. నిత్యం భారీగా ఇసుక అక్రమ రవాణా, తవ్వకాలు, తరలింపు యదేచ్చగా సాగుతున్నా నియంత్రణ యంత్రాంగం నిద్రపోవడం ఈ పరిస్థితికి దారి తీస్తుంది. ఈ పరిస్థితి గురించి చింతల పాలెం గ్రామస్తులు రెండు రోజుల క్రితం రక్షిత తాగునీటి సరఫరా పథకం భావి పక్కన గోతులు తీసి ఇసుక తరలిస్తున్న వారిని అడ్డుకున్నారు. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వెంకట రమణ కి ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఎదురవుతున్న తాగునీటి సమస్య గురించి ఆయన డి ఆర్ వో కి వివరించారు. ప్రత్యేకించి ఈ ప్రాంతం లో ఇసుక అక్రమ రవాణా తవ్వకాలు చేసే మాఫీయా దా వ గూడూరు వెంకన్నపాలెం గ్రామానికి చెందిన వారు నిత్యం భారీగా ఇసుక తరలిస్తున్నారని ఆయన డి ఆర్ వో కి ఫిర్యాదు చేశారు.

# పూర్వ విద్యార్థుల ఔదార్యం

## గర్భిణీ మహిళలకు వైద్యశాలలో భోజనం వసతి

**గిద్దలూరు పెన్ పవర్ జులై 9**

శ్రీ వివేకానంద కళాశాల 83-85-88 బ్యాచ్ పూర్వ విద్యార్థిని విద్యార్థుల చేస్తున్న సోషల్ సర్వీస్ భాగంగా గురువారం కృష్ణం శెట్టి పల్లె ప్రైమరీ హెల్త్ సెంటర్లో 50 మంది గర్భిణీ స్త్రీలకు భోజనవసతి , డ్రై ఫ్రూట్స్ , పండ్లు పంపిణీ కార్యక్రమం డాక్టర్ ఎన్ గురు మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ పి శ్రీధర్ రెడ్డి చేతుల మీదుగా పూర్వ విద్యార్థుల సౌజన్యంతో నిర్వహించారు. కార్యక్రమమునకు కె పి . కాశయ్య, ఖాదర్ వలీ, సాహిద్, పిచ్చిరెడ్డి, పోలయ్య, ప్రసంగి, దుర్గా రాజశేఖర్ రెడ్డి, దుర్గా రంగస్వామి రెడ్డి, ఇస్మాయిల్, టి వెంకట్ రెడ్డి, రవి, జి. కాశయ్య ఎల్ఐసి ఏజెంట్ జనార్దన్ పాల్గొన్నారు . భోజనాలు, డ్రై ఫ్రూట్స్, పండ్లు స్పాన్సర్స్ పి ఎమ్ ఎల్ శ్రీనివాసు ఆడిటర్,ఎల్. అహల్య



రాణి, ఎస్. ప్రసంగి, తులసి బాబు స్పాన్సర్ చేశారు.



## కామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో పంచలోహ విగ్రహాల చోరీ





**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 8**

మండల కేంద్రం సి.ఎస్.పురంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోకి ప్రవేశించిన దుండగులు అక్కడ ఉన్న పంచలోహ విగ్రహాలను అపహరించి తీసుకెళ్లారు ఆలయ పూజారి శ్రీకృష్ణ ఆలయానికి వచ్చి విగ్రహాలు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఎస్సై పి. వెంకటేశ్వరరెడ్డి ఆలయాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. పామూరు సీఐ డి. వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు కనిగిరి క్లూస్ టీం వారు సంఘటనా స్థలాన్ని సందర్శించి ఆధారాలు సేకరించారు. చోరీకి పాల్పడిన వ్యక్తుల కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

## శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాలలో ఐసీఐసీఐ బ్యాంక్ క్యాంపస్ డ్రైవ్

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 09**



స్థానిక ఒంగోలులోని శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాల క్యాంపస్ నందు ఈ నెల 11వ తేదీ (శనివారం) ఐసీఐసీఐ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో భారీ క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు శ్రీ హర్షిణి విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవ్ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు సేల్స్.. రిలేషన్ షిప్ మేనేజర్ పోస్టులకు గాను ఏడాదికి రూ. 3 లక్షల నుండి రూ. 5 లక్షల వరకు భారీ ప్యాకేజీ లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులందరూ ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. ?అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు శనివారం ఉదయం తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, రెజ్యూమ్, ఆధార్ కార్డ్ జిరాక్స్ ప్రతులతో కళాశాల క్యాంపస్ నందు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకై కళాశాల కార్యాలయంలో సంప్రదించవచ్చని మేనేజ్‌మెంట్ వర్గాలు తెలిపాయి. ఇతర వివరాల కోసం 9848246222, 9866119867, 9494941243 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## సర్ ప్రక్రియను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలి

### బొబ్బూరి రమేష్



**సి ఎస్ పురం పెన్ పవర్ జూలై 9**

మండల కేంద్రంలోని సి.ఎస్.పురం బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన సర్ ప్రక్రియ ప్రత్యేక కేంద్రాన్ని మంగళవారం మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ పరిశీలించారు. కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు ఆయన కేంద్రాన్ని సందర్శించి విధులు నిర్వహిస్తున్న బిఎల్ఓ లను ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ, నమోదు ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొబ్బూరి రమేష్ మాట్లాడుతూ, ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలను నింపి సమర్పించకపోతే ఓటరు జాబితాలో పేరు కొనసాగడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు సమయం చాలా తక్కువగా ఉన్నందున ప్రతి ఓటరు అప్రమత్తంగా వ్యవహరించి వెంటనే తమకు సంబంధించిన వివరాలను ఫారాల్లో నమోదు చేసి సంబంధిత అధికారులకు అందజేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు సర్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివరాలను సక్రమంగా నమోదు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషా, రాయిని వెంకటేశ్వర్లు,కాజా, బిఎల్వో లు, బిఎల్ఎ లు స్థానిక ఓటర్లు పాల్గొన్నారు.

## గ్యాస్ సమస్యే కదా అని నిర్లక్ష్యం చేయొద్దు

### ప్రాణాపాయం తప్పించిన గిద్దలూరు గాయత్రి వైద్యులు డాక్టర్ బ్రహనంద రెడ్డి

**గిద్దలూరు పెన్ పవర్ జులై 9**



కడుపు నొప్పి, గ్యాస్ సమస్యలను చాలామంది సాధారణంగా భావిస్తుంటారు. ఇంటి చిట్కాలతోనో, స్థానిక మందుల షాపుల్లో దొరికే మాత్రలతోనో సర్దుబాటు చేసుకుంటారు కానీ, కొన్ని సందర్భాల్లో ఇవే ప్రాణాపాయ స్థితికి దారితీస్తాయని గిద్దలూరు గాయత్రీ మల్టీ స్పెసిలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎన్ బ్రహ్మనందరెడ్డి హెచ్చరిస్తున్నారు. ఇటీవల సంక్లిష్టమైన గాల్‌బ్లాడర్ సమస్యతో బాధపడుతున్న ఓ రోగికి ప్రాణాపాయం నుండి తప్పించి, తమ వైద్య నైపుణ్యాన్ని డాక్టర్ ఎన్ బ్రహ్మనందరెడ్డి నిరూపించుకున్నారు.

**వైద్యం కోసం వచ్చిన వ్యక్తి మాటల్లో ...**

**సమస్య ఏంటంటే..:** గిద్దలూరు నియోజకవర్గం, బేస్తవారిపేట మండలం, పందిళ్లపల్లి గ్రామానికి చెందిన 34 ఏళ్ల వ్యక్తి గత కొద్ది రోజులుగా తీవ్రమైన కడుపు నొప్పి, గ్యాస్ సమస్యతో సతమతమయ్యారు. ఇది సాధారణ గ్యాస్ సమస్యేనని భావించి పలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించారు. అయితే, వైద్య పరీక్షలు చేయగా.. ఆయనకు గాల్‌బ్లాడర్‌లో తీవ్రమైన ఇన్ఫెక్షన్ ఉండటమే కాకుండా, చీము చేరినట్లు (గ్యాంగ్రీనస్ కోలిసిస్టైటిస్) గుర్తించారు.

**అన్నిచోట్లా తిరస్కరణ...:** రోగి పరిస్థితి విషమంగా ఉండటంతో పాటు కేసు చాలా సంక్లిష్టంగా ఉండటంతో.. పెద్ద ఆసుపత్రుల్లో సైతం అత్యంత రిస్క్‌తో కూడిన ఆపరేషన్ అని, ఖర్చు కూడా అధికమవుతుందని వైద్యులు సూచించారు. ఈ దశలో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతుండగా, గిద్దలూరులోని గాయత్రి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య బృందం ఈ కేసును ఒక సవాలుగా తీసుకుంది.

**అత్యంత జాగ్రత్తగా చికిత్స...:** డాక్టర్ విష్ణు ప్రసాద్, డాక్టర్ గాయత్రి, డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి నేతృత్వంలోని వైద్య బృందం రోగి పరిస్థితిని క్షుణ్ణంగా విశ్లేషించి, ముందుగా పేషెంట్‌ను స్టేబిలైజ్ చేసి, ఇన్ఫెక్షన్‌ను అదుపులోకి తెచ్చారు. అనంతరం సరైన సమయంలో సర్జరీ నిర్వహించి, ప్రమాదకరంగా మారిన గాల్‌బ్లాడర్‌ను విజయవంతంగా తొలగించారు. ఈ చికిత్స అనంతరం రాజేంద్ర ప్రసాద్ పూర్తిగా కోలుకున్నారు.

**సరైన సమయంలో సరైన వైద్యం ముఖ్యం..:** నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం కలిగించే ఇలాంటి క్లిష్టమైన కేసులను మా ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన వైద్యుల బృందం విజయవంతంగా నిర్వహిస్తుంది" అని గాయత్రి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు తెలిపారు. ఆరోగ్య సమస్యలను చిన్నవిగా చూసి ఆలస్యం చేయకుండా, వెంటనే నిపుణులను సంప్రదించి సరైన వైద్యం తీసుకోవాలని బ్రహ్మానందరెడ్డి సూచించారు.

## గర్భిణీలు బాలింతలకు వరం కిల్కారి సేవల పథకం

### - కిల్కారి రీజనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజు

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 09**



ఒంగోలులోని పాపా కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రధాన్ మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని కిల్కారి రీజినల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజు, జిల్లా ఆశా నోడల్ ఆఫీసర్ రాజేశ్వరి సందర్శించారు. ఈ సందర్భంగా కిల్కారి రీజినల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం గర్భిణీలు, బాలింతల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రవేశపెట్టిన కిల్కారి సేవల గురించి అవగాహన కల్పించారు. గర్భధారణ నాలుగో నెల నుంచి శిశువుకు ఒక సంవత్సరం వయస్సు వచ్చే వరకు ప్రతి నెల 911600403660 నంబర్ నుంచి కిల్కారి వాయిస్ కాల్స్ వస్తాయని తెలిపారు. ఈ కాల్స్ ద్వారా గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవసరమైన వైద్య పరీక్షలు, పౌష్టికాహారం, ఏఎన్‌సీ పరీక్షలు, ప్రసవ ప్రణాళిక (బర్త్ ప్లాన్), తల్లిపాల ప్రాముఖ్యత, నవజాత శిశు సంరక్షణ, డయేరియా, న్యుమోనియా నివారణ, కుటుంబ నియంత్రణ పద్ధతులు తదితర తల్లి--శిశు ఆరోగ్యానికి సంబంధించిన ముఖ్యమైన సలహాలు, సూచనలు అందించబడతాయని తెలిపారు. ప్రతి గర్భిణీ, బాలింత కిల్కారి కాల్స్‌ను తప్పకుండా విని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ఆశా నోడల్ ఆఫీసర్ రాజేశ్వరి మాట్లాడుతూ, గర్భిణీలకు ప్రభుత్వ ఆరోగ్య సంస్థల ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. సురక్షిత ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యామని, వైద్య సిబ్బంది, గర్భిణీలు పాల్గొన్నారు.

## గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా డాక్టర్ ఏడుకొండలరావు ఎన్నిక

### - వైద్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ప్రకటన





**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 09**

ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల (జీఎంసి), ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జిజిహెచ్) గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునిగా డాక్టర్ డి. ఏడుకొండలరావు, కార్యదర్శిగా డా. పి. నటరాజ్, కోశాధికారిగా డా. కె. వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. అదేవిధంగా గౌరవ అధ్యక్షునిగా డాక్టర్ మస్తాన్ బాషా, జనరల్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ నరసింహ చారి, డాక్టర్ ఎ. తిరుపతిరెడ్డి, డాక్టర్ ఎ. శ్రీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు డాక్టర్ డి. ఏడుకొండలరావు మాట్లాడుతూ, జీఎంసీ-- జీజీహెచ్ ఒంగోలులో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్యుల సమస్యలను రాష్ట్ర అసోసియేషన్ సహకారంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే వైద్యుల సంక్షేమం, సేవా పరిస్థితుల మెరుగుదల, పరస్పర సహకారంతో సంస్థను మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు సహచర వైద్యులు, సిబ్బంది అభినందనలు తెలియజేస్తూ, వారి పదవీకాలంలో వైద్యుల సంక్షేమానికి విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు.

## రాజీయే రాజమార్గం..

### జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి - సీఐ రామకోటయ్య



**గిద్దలూరు పెన్ పవర్ జులై 9**

వివాదాలకు ముగింపు పలికి, సంబంధాలకు కొత్త ఆరంభాన్ని ఇచ్చే 'జాతీయ లోక్ అదాలత్'ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య పిలుపునిచ్చారు. మార్కాపురం సబ్ డివిజన్, గిద్దలూరు రూరల్ సర్కిల్ పరిధిలో ఈనెల 11న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ గురించి ఆయన కక్షిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రామకోటయ్య మాట్లాడుతూ.. కోర్టుల చుట్టూ తిరుగుతూ కేసుల వల్ల ఇరుపక్షాలు పడుతున్న ఇబ్బందులను ఆయన గుర్తు చేసారు. ఇరువురు పరస్పర చర్చలు, అవగాహనతో లోక్ అదాలత్‌లో సమస్యలను పరిష్కరించుకోవడం వల్ల ఇరువురికి సమయం, డబ్బు ఆదా అవుతుందని తద్వారా కలిగే ప్రయోజనాలను ఆయన ప్రజలకు వివరిస్తున్నామన్నారు.

**లోక్ అదాలత్ ప్రత్యేకతలు:** ఎటువంటి కోర్టు ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని, తక్కువ సమయంలోనే కేసు పరిష్కారం, అలాగే సామరస్యపూర్వక చర్చల ద్వారా వివాదాలకు శాశ్వత ముగింపు లభించడం. గొడవలు వీడి, పరస్పర అంగీకారంతో రాజీ పడటం వల్ల సామాజిక సంబంధాలు కూడా మెరుగుపడతాయన్నారు. కక్షిదారులు ఈ విలువైన అవకాశాన్ని ఉపయోగించుకుని, పెండింగ్‌లో ఉన్న తమ వివాదాలను ఈనెల 11న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ లో శాశ్వతంగా పరిష్కరించుకోవాలని సీఐ రామకోటయ్య కోరారు.

## ఆంజనేయులు.. శివ రామ్‌ల సేవలు అభినందనీయం

### పొగాకు సమాఖ్య మాజీ చైర్మన్ చుంచు శేషయ్య



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 09**

ఎంతో గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో ఎక్కడ పనిచేసిన నీతి నిజాయితీ నిబద్ధత తో విధులు నిర్వహించి ఎంతోమంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు బరువురి శివరాం ప్రసాద్, బోయెడి ఆంజనేయులు సేవలు ఆదర్శనీయం అని పొగాకు సమాఖ్య మాజీ చైర్మన్ చుంచు శేషయ్య పేర్కొన్నారు. గురువారం ఒంగోలు మండలం ఉలిచి గ్రామంలో గుండ్లకమ్మ సామాజిక సాహిత్య సేవా సమాఖ్య.. ఎన్టీఆర్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదవీ విరమణ చేసిన ఉలిచి గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు బరువురి శివరాం ప్రసాద్ బోయెడి ఆంజనేయులు లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుండ్లకమ్మ సామాజిక సేవా సమాఖ్య అధ్యక్షుడు మండవ సుబ్బారావు, శ్రీ శారదా నికేతన్ ఫౌండర్ దివి కోటేశ్వరరావు, రిటైర్డ్ ప్రొఫెసర్ నన్నపనేని చంద్రశేఖర రావు, పిల్లుట్ల సుధాకర్ రావు, చుంచు సింగయ్య, చుంచు రామకృష్ణ , ఎర్రంనేని నరసింహారావు, చుంచు నాగేశ్వరరావు, నేని ఎర్రంనేని వెంకట శేషయ్య లు విశ్రాంత ఉపాధ్యాయులు ఉలిచి గ్రామానికి చేసిన సేవలను కొనియాడారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ కార్యక్రమం నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, సంస్థ సభ్యులు పాల్గొని విజయవంతం చేశారు.

# సి ఎస్ పురంలో భక్తిశ్రద్ధలతో పీర్ల పండుగ వేడుకలు

## వేడుకలను వీక్షించిన బొబ్బూరి రమేష్





**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 9**

మండల కేంద్రంలోని సి.ఎస్. పురంలో పీర్ల పండుగ సందర్భంగా గ్రామస్తులు పెద్ద సరిగత్ ను అత్యంత వైభవంగా వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని వీక్షించుటకు మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ పాల్గొన్నారు ఈ సందర్భంగా గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పండుగకు సంబంధించిన ఏర్పాట్లను గ్రామ పెద్దలు, యువకులు ముందుండి చేపట్టగా, గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది.సాయంత్రం వేళ ఏర్పాటు చేసిన గుండంలో కర్రలను వేసి నిప్పు వెలిగించారు. అనంతరం భక్తులు పీర్లను భక్తిశ్రద్ధలతో తమ భుజాలపై మోసుకుంటూ గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లారు. డప్పుల మోతలు, భక్తుల నినాదాలు, ప్రత్యేక ప్రార్థనల మధ్య సాగిన ఈ ఊరేగింపు గ్రామ ప్రజలను ఆకట్టుకుంది. మహిళలు, చిన్నారులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను తిలకించారు.ఊరేగింపు అనంతరం భక్తులు గుండం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి, అనంతరం గుండంలో ప్రవేశించి తమ భక్తి విశ్వాసాలను చాటుకున్నారు. గుండం ప్రవేశ కార్యక్రమం సందర్భంగా భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ తమ మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది.ఈ సందర్భంగా బొబ్బూరి రమేష్ మాట్లాడుతూ పీర్ల పండుగ అనేది కేవలం ఒక మతానికి చెందిన పండుగ మాత్రమే కాదని, కుల మతాలకు అతీతంగా ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే సామరస్యానికి ప్రతీక అని అన్నారు గ్రామీణ ప్రాంతాల్లో ఐక్యమత్యం పెంపొదించడంలో ఇటువంటి పండగలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు పూర్వికులు నుండి వస్తున్న సంప్రదాయాలకు భావితరాలకు అందిస్తున్న పండుగ పీర్ల పండుగని అన్నారు మండలంలోని ప్రజలందరికీ పీర్ల పండుగ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషా, మాజీ ఎంపీపీ పాలిశెట్టి సత్యం, పట్టణ టిడిపి అధ్యక్షులు బత్తుల వెంకటాద్రి, కాజా, సంగిశెట్టి వెంకటేశ్వర్లు,యాసం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అద్దంకి నియోజకవర్గానికి మరో రెండు నూతన సబ్‌స్టేషన్ల మంజూరు

**ముక్తేశ్వరం, వెంపరాలకు 33/11 కేవీ విద్యుత్ కేంద్రాలు**



**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) జూలై 09:**

అద్దంకి నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ ప్రత్యేక చొరవతో బల్లికురవ మండలం, ముక్తేశ్వరం, అద్దంకి మండలం, వెంపరాల గ్రామాలకు ఒక్కో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైనట్లు గురువారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. వీటి నిర్మాణంతో నియోజకవర్గంలోని రైతులు, గ్రామీణ ప్రాంతాల వినియోగదారులు ఎదుర్కొంటున్న లో వోల్టేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. వ్యవసాయానికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థను ఆధునీకరిస్తూ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. కొత్తగా ఏర్పాటు కానున్న ఈ సబ్‌స్టేషన్ల ద్వారా పరిసర గ్రామాలకు కూడా విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని, ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గి వోల్టేజ్ హెచ్చుతగ్గుల సమస్య ఉండదని వివరించారు. రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని బలోపేతం చేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

## శ్రీ దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్ కుటుంబ సభ్యులు

**కందుకూరు పెన్ పవర్, జూలై 9**

లింగసముద్రం మండలం మొగిలిచర్ల గ్రామంలో ఉన్న శ్రీ దత్తాత్రేయ స్వామి వారిని ఈరోజు ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్సీ శ్రీకాంత్ దంపతులకు తీర్థ ప్రసాదాలు, వేద ఆశీర్వచనం స్వామివారి శేష వస్త్రాన్ని అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ శ్రీకాంత్ దంపతుల చేతులు మీదుగా భక్తులకు అన్నప్రసాదవినియోగం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ మొగిలిచర్ల శ్రీ దత్తాత్రేయ స్వామి అనుగ్రహంతో అందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అంతకుముందు ఆలయ అర్చకులు శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు ఘన స్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.





## స్కూలు, కాలేజీ బస్సులను తనిఖీ చేసిన అధికారులు

**కొమరోలు పెన్ పవర్ జూలై 9**




కొమరోలు మండలంలోని స్కూలు, కాలేజీ లకు సంబంధించిన బస్సులను గురువారం పోలీసులు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, గిద్దలూరు రూరల్ సీఐ జే రామకోటయ్య పర్యవేక్షణలో కొమరోలు ఎస్ఐ నాగరాజు, మార్కాపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేఎల్ రావు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థుల రవాణాకు వినియోగిస్తున్న కొమరోలు లోని పాఠశాలల, కళాశాల, బస్సులను తనిఖీ చేశారు.ఆ సందర్భంగా బస్సుల రిజిస్ట్రేషన్ పత్రాలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, బీమా, డ్రైవింగ్ లైసెన్సులు, ఇతర వాహన రికార్డులు మరియు బస్సుల సాంకేతిక పరిస్థితిని పరిశీలించారు.విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, బస్సులను పూర్తిగా రోడ్డు యోగ్యమైన స్థితిలో నిర్వహించాలని, అతివేగంగా నడపకూడదని, సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించరాదని, అన్ని ట్రాఫిక్ నిబంధనలు మరియు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని పాఠశాల, కళాశాల యాజమాన్యాలు మరియు డ్రైవర్లకు అధికారులు సూచించారు. విద్యార్థుల సురక్షిత రవాణా విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని ప్రైవేటు పాఠశాలలు, కళాశాల నిర్వహకులకు, బస్సులు డ్రైవర్లకు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కే ఎల్ రావు కొమరోలు ఎస్ఐ నాగరాజు హెచ్చరించారు.

## విగ్రహ ప్రతిష్ట వేడుకల్లో పాల్గొన్న కోనంగి వెంకట కొండయ్య

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 9**



మండలంలోని బోయమడుగుల పంచాయతీ పరిధిలో గల అటవీ ప్రాంతమైన తుంగోడు గ్రామంలో అవధూత కాశీనాయన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త చినకొండు వెంకటయ్య పర్యవేక్షణలో, విగ్రహ దాతలు చిట్టిబోయిన వెంకటేశ్వర్లు బ్రదర్స్ సమక్షంలో వేద మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ఠా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ డైరెక్టర్ కోనంగి వెంకటకొండయ్య హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవధూత కాశీనాయన భక్తి, సేవా భావానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంలో ఇలాంటి ఆలయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలు, గ్రామస్తులు, భక్తుల సేవాభావం అభినందనీయమని ఆయన కొనియాడారు. భవిష్యత్తులో ఆలయం మరింత అభివృద్ధి చెంది భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా మారాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొర్ల అల్లూరయ్య, చినకొండు పెద తిరుమలయ్య,దొర తిరుపతయ్య, గ్రామ టిడిపి అధ్యక్షులు రమణారెడ్డి, బంకా మాలకొండయ్య, చిన మాలకొండయ్య, జయరాములు, మాధవ , వెంకటరమణయ్య, చెంచి రెడ్డి, రామకృష్ణ, ఏడుకొండలు, తిరుపతయ్య, వెంకట రమణయ్య, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## అనాధాశ్రమం లో వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేసిన పులి రామచంద్రారెడ్డి



**సి ఎస్ పురం పెన్ పవర్ జులై 9**

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి వేడుకలను పురస్కరించుకొని వైఎస్సార్సీపీ నాయకులు పులి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అనాథశ్రమంలో వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించి భారీ కేక్ కట్ చేశారు ఈ సందర్భంగా పులి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల సంక్షేమాన్ని తన పాలనకు కేంద్రబిందువుగా చేసుకున్న ప్రజానాయకుడని కొనియాడారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి కోట్లాది మంది ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని,ప్రజల కష్టాలను తెలుసుకోవడానికి పాదయాత్ర చేసి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్న నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని అన్నారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సాగునీటి రంగాలకు ఆయన అందించిన సేవలు రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతాయని తెలిపారు. ప్రజల కోసం నిరంతరం శ్రమించిన మహానేతగా ఆయనను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు.వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలు, సంక్షేమ భావన నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పులి రామచంద్రారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో గంటా త్రివేణి రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, వీరారెడ్డి, బుర్రాజు రమణయ్య, పులి మాల్యాద్రి, డాన్ శీను, బోయిన లక్ష్మయ్య, శ్రీనివాసరెడ్డి, గుమ్మ మురళి, రాళ్లపల్లి గురవయ్య, సాగర్ రెడ్డి, శివారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పొదిలిలో విద్యా సంస్థల బస్సులను తనిఖీ చేసిన ఎస్ఐ రాజేష్

**పొదిలి, పెన్ పవర్, జూలై 9**

పొదిలిలో విద్యాసంస్థలకు చెందిన బస్సులను పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ సూ రెడ్డి రాజేష్ తనిఖీ జరిపారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు విద్యాసంస్థలకు చెందిన బస్సులను ఎస్ఐ రాజేష్ తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేష్ విద్యాసంస్థల బస్సులకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ జరిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజేష్ తో పాటు సిబ్బంది కూడా పాల్గొన్నారు.




## బండారు వెంకట రామయ్య అకాల మరణం బాధాకరం.. కదిరి పార్థసారథి



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 9**

సియస్ పురం మాజీ ఎంపీటీసీ సభ్యులు బండారు వెంకట రామయ్య అకాలమరణం బాధాకరమని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ కరస్పాండంట్ కదిరి పార్థసారథి అన్నారు. గురువారం వెంకట రామయ్య గుండెపోటుతో మృతి చెందారు. వెంకట రామయ్య భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు.వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మన్నెపల్లి పెద్దన్న, గోను చంద్రశేఖర్ రెడ్డి, మూరం కాశిరెడ్డి, తికెనం బాబురావు, తదితరులు ఉన్నారు.

## సంతమాగులూరు నూతన ఎస్సైగా పి.నాగమల్లేశ్వరరావు




**సంతమాగులూరు, పెన్ పవర్, జూలై 9**

ఎస్పీ హర్షవర్ధన్ రాజు అదేశాల మేరకు గత శనివారం ప్రకాశం జిల్లా టంగుటూరు స్టేషన్లో ఎస్సైగా పనిచేస్తున్న నాగమల్లేశ్వరరావును బదిలీపై సంతమాగులూరుకు పంపించడం జరిగింది. సంతమాగులూరు నూతన ఎస్సైగా నాగమల్లేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో దృష్టిసాదిస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

## బండ్ల వారి నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న.. కదిరి పార్థసారథి



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 9**

పామూరు పట్టణానికి చెందిన బండ్ల నారాయణ కుమార్తె నిఖిత, సాయి నవీన్ కుమార్ ల నిశ్చితార్థ వేడుక గురువారం పామూరు లోని అనిల్ గార్డెన్ లొ జరిగింది. ఈ వేడుకలో కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ కరస్పాండంట్ కదిరి పార్థసారథి పాల్గొని కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన దివి రవీంద్రనాథ్



**వలేటివారిపాలెం పెన్ పవర్, జూలై 9**

మండలంలోని శాఖవరం గ్రామ వాస్తవ్యులు కంద్రా మాల్యాద్రి , సుజాత దంపతుల కుమారుడు కంద్రా మనోజ్ కుమార్ , శ్వేత ల వివాహం ఇటీవల జరుగగా వివాహానికి హాజరు కాలేనందున 16 రోజుల పండుగ సందర్భంగా గురువారం శాఖవరం గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించిన దివి రవీంద్రనాథ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట శాఖవరం గ్రామ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వడ్లమూడి రామకృష్ణ , వడ్లమూడి శ్రీహరి , ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే , కాకర్ల మల్లికార్జున రావు తదితరులు ఉన్నారు.

# అసంపూర్ణ కమ్యూనిటీ హాళ్లకు రూ.1.02 కోట్ల నిధులు

## గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకే ప్రాధాన్యం: మంత్రి గొట్టిపాటి



**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) జూలై 09**

బల్లికురవ మండల పరిధిలోని వైదన, ముక్తేశ్వరం, రామాంజనేయపురం గ్రామాల్లో అసంపూర్ణంగా నిలిచిపోయిన కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ భవనాల నిర్మాణాలను పూర్తి చేసేందుకు రూ.1,02,60,000 నిధులను మంజూరు చేసినట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. తాజాగా మంజూరైన నిధులతో ఆయా గ్రామాల్లో నిలిచిపోయిన కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తామన్నారు. సాధ్యమైనంత త్వరగా వీటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తగిన చర్యలు చేపడతామని వెల్లడించారు. ?గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుకోవడానికి ఈ కమ్యూనిటీ హాళ్లు ఎంతో ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# రేపు సిపిఐ జిల్లా శిక్షణా తరగతులు




**కందుకూరు పెన్ పవర్, జూలై 9:**

జూలై 11, 12న పట్టణంలోని స్వర్ణ ప్యాలస్ లో సిపిఐ జిల్లా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు తెలిపారు. స్థానిక కోటారెడ్డి భవన్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో రాజకీయ పరిస్థితులు, ఆర్థిక సామాజిక సాంస్కృతి రంగాలలో జరుగుతున్న మార్పులపై సిపిఐ భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా వ్యాప్తంగా కౌన్సిల్ సభ్యులకు సైద్ధాంతిక రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ శిక్షణా తరగతులు రెండు రోజుల పాటు నిర్వహించటం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య హాజరవుతారని ఆయన అన్నారు. వారితో పాటు అనుభవం కలిగిన ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీనివాసులు, డాక్టర్ సీఎన్ క్షేత్ర పాల్ రెడ్డి, డి.సాగర్, డి. జమీందార్, ఎం. వెంకయ్యలు తో సిపిఐ కార్యకర్తలు, కౌన్సిల్ సభ్యులకు శిక్షణా బోధన నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు జిల్లా నలుమూలల నుండి సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొని శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పి బాలకోటయ్య, వై.ఆనందమోహన్, లక్ష్మీనారాయణ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టు డైరెక్టర్ గా పద్మ సునంద

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 09**

ప్రకాశం జిల్లా నూతన ఐ.సీ.డీ.ఎస్. ప్రాజెక్టు డైరెక్టరుగా ఏ. పద్మ సునంద బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ని మర్యాదపూర్వకంగా కలిశారు.



# రోడ్డు మార్జిన్‌లో మట్టి తొగింపు

**గిద్దలూరు పెన్ పవర్ జులై 9**

గిద్దలూరు పట్టణంలో ని అమరావతి– అనంతపురం రోడ్డు లో మార్జిన్ లో రెస్టారెంట్ , టీ స్టాల్ యజమానులు రోడ్డు కంటే ఎత్తుగా పోసిన మట్టి , మొరసను , ఎమ్మెల్యే ఆదేశాల మేరకు హైవే అధికారుల ఆధ్వర్యంలో యంత్రాలతో తో మట్టిని తొలగించారు. దీంతో హైవే రోడ్డు మార్జిన్ శుభ్రంగా తయారయింది గతంలో ఈరోడ్డు పై ఇరువైపులా రోడ్డు కంటే ఎత్తుగా మట్టి వేయటం తో రోడ్డు వై వర్షం నీరు నిలిచి ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తుంది. అయితే ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఆదేశాలతో మట్టిని తొలగించి మార్జిన్లను ఏర్పాటు చేయడంతో రోడ్డు విశాలంగా కనిపిస్తుంది. ఇట్లే పట్టణంలో కూడా ఆక్రమణలను సర్దుబాటు చేయాలసిన అవసరముంది.. కాకుండా పట్నంలోమున్సిపాలిటి ఆధ్వర్యంలో అన్ని వీధుల్లో సిమెంట్ రోడ్లు వేశారు కానీ కొందరు ఇండ్ల యజమానులు తమ ఇంటిముందు సిమెంట్ రోడ్డు ఉన్నపటికీ మరో రెండు లేయర్ల ఎత్తు లేపుకుని స్పీడ్ బ్రేకర్లు వేసుకున్నారు దీంతో ఏపాటివర్షం వచ్చినా వర్షపునీరు సైడ్ కాలువల్లోకి వెళ్ళేవీలులేక రోడ్డుపైనే ప్రవహిస్తుంది. దీంతో రోడ్డు కాస్త కాలువగా మారి వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కాకుండా ఏదైనా వాహనం ఎదురుగావస్తే ద్విచక్ర వాహన చోదకుడి అవస్థలు అన్ని ఇన్నికావు. మున్సిపల్ అధికారులు





జోక్యం చేసుకుని సిమెంట్ రోడ్లపై ఇండ్లముందు సిమెంట్ తో ఎత్తుగా వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని , ఎత్తుగా వేసినవి తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

# స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన గుడ్లూరు పోలీసులు






**గుడ్లూరు, పెన్ పవర్, జులై 09:**

పాఠశాలల విద్యార్థుల భద్రత కోసం గుడ్లూరు పోలీసులు స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వి.వెంకట్రావు తన సిబ్బందితో వెళ్లి మండల కేంద్రమైన గుడ్లూరులో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలను సందర్శించి, స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. ఫిట్‌నెస్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ప్రథమ చికిత్స పెట్టె వంటివి ఉన్నాయా, లేవా అని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఎస్సై వి.వెంకట్రావు మాట్లాడుతూ ప్రమాణాలు లేని వాటిపై కేసులు నమోదు చేసి బస్సులను సీజ్ చేయడం చేయడం జరుగుతుందన్నారు. మండలంలో ఉన్న ప్రతి పాఠశాల బస్సులు అవసరమైన ఫిట్‌నెస్ సర్టిఫికేట్లను తప్పక పొంది ఉండాలన్నారు. పరిమితికి మించి విద్యార్థులను తరలించడం మరియు డ్రైవర్లు సరైన యూనిఫాం ధరించకపోవడం, అతివేగంగా నడపడం వంటి ఉల్లంఘనలను గుర్తుచేసి, తప్పక వాటిని పాటించాలని అన్నారు. నిబంధనలు పాటించని బస్సులను సీజ్ చేయడమే కాకుండా, భారీగా జరిమానాలు వసూలు చేయడం జరుగుతుందన్నారు. అత్యవసర ద్వారాలు, అగ్నిమాపక పరికరాలు సక్రమంగా ఉన్నాయో లేదో అని తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని పాఠశాల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అన్ని భద్రతా ప్రమాణాలు పాటించాలని, లోపాలు ఉన్న బస్సులను వెంటనే సరిచేసుకోవాలని ఎస్సై ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తో పాటు పోలీస్ సిబ్బంది, బస్సుల డ్రైవర్లు, పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

# పొదిలి ఎంఈఓగా బివి రెడ్డి



**పొదిలి, పెన్ పవర్, జూలై 9**

పొదిలి మండల విద్యాశాఖ అధికారిగా బీవీ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం నాడు తన ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈఓ బీవీ రెడ్డి మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధి కోసం తన శాసశక్తుల కృషి చేస్తానని తెలిపారు. విద్యాపరంగా విద్యార్థులకు, సిబ్బందికి ఎటువంటి సమస్యలు ఎదురైనా, ఆయా సమస్యల్ని పరిష్కరించేందుకు ముందు ఉంటా నాని ఎంఈఓ బీవీ రెడ్డి చెప్పారు. నూతనంగా ఎంఈఓ గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన బీవీ రెడ్డిని ఉపాధ్యాయులు, విద్యాశాఖకు చెందిన సిబ్బంది తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

# పొదిలిలో సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఏఎంసి చైర్మన్ డాక్టర్ ఇమాం సా

**పొదిలి, పెన్ పవర్, జూలై 9**

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని పొదిలి ఏఎంసి చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమామ్ సా పరిశీలించారు. గురువారం నాడు ఆయన పొదిలిలో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని పరిశీలించడంతోపాటు సంబంధించిన బిఎల్ఓ ల తో మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరి ఓటు నమోదు జరిగేలా అధికారులు చూడాలని డాక్టర్ ఇమాంస సూచించారు. అలాగే బి ఎల్ ఓ లకు ఓటర్ నమోదు విషయంలో పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చూడాలని చైర్మన్ కోరారు.

# ఉపాధ్యాయురాలుగా మారిన కలెక్టర్ విజయ సునీత





**మార్కాపురం పెన్ పవర్ జూలై 9**

పాఠశాలలు నాణ్యమైన విద్యకు చిరునామాగా నిలవాలని, విద్యార్థుల్లో పఠన సామర్థ్యం, గణిత నైపుణ్యాలు, ఆలోచనా శక్తిని పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలని జిల్లా కలెక్టర్ విజయ సునీత సూచించారు. గురువారం మండలంలోని రాయవరం లో ఉన్నా కే జీ బీ వీ పాఠశాలను జిల్లా కలెక్టర్ విజయ సునీత తనిఖీ చేసి విద్యార్థులతో సరదాగా ముట్టడించారు. ప్రతి తరగతికి వెళ్లి విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడి వారిలో ధైర్యాన్ని నింపారు. విద్యార్థులందరూ చదువు పైనే దృష్టి పెట్టాలని మరే ఇతర వ్యాపకాల జోలికి వెళ్ళవద్దన్నారు. ఉన్నత చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని . అనంతరం కలెక్టర్ స్వయానా బ్లాక్ బోర్డ్ పై చదువులోని మెలకువలను విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా సౌర కుటుంబ పాఠాన్ని ప్రత్యేకంగా తెలియజేసి విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా అక్కడ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమం లో డీ ఈ వో సుబ్బారావు, ఎం ఈ వో రాందాస్ నాయక్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు మీద నిర్మించిన షెడ్‌ను సత్వరమే తొలగించాలి

## – జిల్లా కలెక్టర్



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 09**

గురువారం జిల్లా కలెక్టర్.. నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి పి. రాజబాబు నగరపార సంస్థ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు నుండి అర్జీలను స్వీకరించి వాటిని సత్వర పరిష్కారానికి తగిన ఆదేశాలు జారీ చేశారు. అన్నదమ్ముల మధ్య భూ వివాదాలు, ఇంటికి పోయే దారిలో రోడ్డుమీద నిర్మించిన షెడ్డును తీసివేయాలని అంతే కాకుండా గతవారం వచ్చిన అర్జీల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వచ్చిన అర్జీలను త్వరితగతిని పరిష్కరించాలని ఆయన సంబంధిత సిబ్బందికి సూచించారు. మామిడిపాలెం వద్ద రోడ్డు మీద నిర్మించిన షెడ్ ను సత్వరమే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని డబుల్ రిజిస్ట్రేషన్ విషయంలో ఆయన సూచించారు. డబుల్ రిజిస్ట్రేషన్ విషయమై సంబంధిత అర్జీదారులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న అభ్యర్థులకు పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ కృష్ణయ్య, మునిసిపల్ ఎం.హెచ్.ఓ. ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పొదిలిలో సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఏఎంసి చైర్మన్ డాక్టర్ ఇమాం సా

**పొదిలి, పెన్ పవర్, జూలై 9**

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని పొదిలి ఏఎంసి చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమామ్ సా పరిశీలించారు. గురువారం నాడు ఆయన పొదిలిలో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని పరిశీలించడంతోపాటు సంబంధించిన బిఎల్ఓ ల తో మాట్లాడి



పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరి ఓటు నమోదు జరిగేలా అధికారులు చూడాలని డాక్టర్ ఇమాంస సూచించారు. అలాగే బి ఎల్ ఓ లకు ఓటర్ నమోదు విషయంలో పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చూడాలని చైర్మన్ కోరారు.

# దేవాలయాల్లో వరుస చోరీలు, రాత్రిపూట ఇళ్లలో, షాపుల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన ప్రకాశం జిల్లా పోలీసులు.

### రూ.3.50 లక్షల విలువైన నగదు, బంగారు ఆభరణాలు, ఇత్తడి గంటలు, ద్విచక్ర వాహనం స్వాధీనం





**దర్శి జూలై 9 పెన్ పవర్**

సర్కిల్ పరిధిలో ఇటీవల జరిగిన దేవాలయ చోరీలు, రాత్రిపూట ఇళ్లలో మరియు వ్యాపార సంస్థలో జరిగిన దొంగతనాల కేసులను ఛేదించినట్లుగా వెల్లడించిన దర్శి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై. రామారావు ప్రకాశం జిల్లా పోలీసు ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్., ఆదేశాల మేరకు, దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణ పర్యవేక్షణలో, దర్శి సీఐ వై. రామారావు ఆధ్వర్యంలో తాళ్లూరు ఎస్సై ఎస్ మల్లికార్జున రావు, దొనకొండ ఎస్సై ఎల్ రామకృష్ణ మరియు సిబ్బంది కలిసి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, సుమారు రూ.3.50 లక్షల విలువైన నగదు, బంగారు ఆభరణాలు, ఇత్తడి గంటలు మరియు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ నెల 5వ తేదీ రాత్రి తాళ్లూరు మండలం నాగంబొట్లవారిపాలెం గ్రామ శివారులోని కాటమరాజు దేవాలయంలో ఇత్తడి గంటలు చోరీకి గురైన ఘటనపై తాళ్లూరు ఎస్సై ఎస్.మల్లికార్జునరావు కేసు నమోదు చేసి, పాత నేరస్తుల కదలికలను విశ్లేషించి పొదిలికి చెందిన పొదిలి నరసింహా రావు చిన్న వెంకటేశ్వర్లు, వయస్సు 33 సంవత్సరాలు, ఓబిలశెట్టి వారి వీధి, పొదిలి టౌన్ అతనిని అదుపులోకి తీసుకుని విచారించగా కాటశీరాజు గుడిలో ఇత్తడి గంటలను దొంగతనం చేసినట్లు తేలింది. అంతేగాక దొనకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగినపూడి గ్రామ శివాలయంలో హుండీ పగులగొట్టి రూ.1,000 నగదు, అలాగే నల్లబోతువారిపాలెం గ్రామంలోని పోలేరమ్మ దేవాలయంలో హుండీ పగులగొట్టి రూ.10,000 ను కూడా నగదు అపహరించినట్లు తెలిపాడు. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.60,000 విలువైన 40 ఇత్తడి గంటలు సుమారు 50 కిలోల బరువు స్వాధీనం చేసుకోవడం జరిగింది. అదేవిధంగా పొదిలి పట్టణంలో జరిగిన ద్విచక్ర వాహన చోరీ కేసులో కూడా ఇదే నిందితుడి ప్రమేయం ఉన్నట్లు తేలడంతో, రూ.90,000 విలువైన ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకోవడమైనది వెల్లడించారు. పొదిలి నరసింహారావుపై గతంలో వివిధ పోలీస్ స్టేషన్లలో సుమారు 40 చోరీ కేసులు నమోదై ఉన్నట్లు విచారణలో తేలింది. మరో కేసులో దొనకొండ ఎస్సై గా ఎల్ రామకృష్ణ మరియు వారి సిబ్బంది, మేకల ధనరాజ్ తండ్రి లాబాను, వయస్సు 19 సంవత్సరాలు, ఎర్రబాలెం గ్రామం, దొనకొండ మండలం ను అదుపులోకి తీసుకుని విచారించగా, ఈ నెల 3వ తేదీన దొనకొండలోని ఒక కొరియర్ కార్యాలయంలో రూ.50,000 నగదు, ఒక మొబైల్ ఫోన్ దొంగిలించినట్లు, అలాగే పడమటి వెంకటాపురం గ్రామంలో పగటి సమయంలో ఒక ఇంటిలో చొరబడి నల్లపూసల దండ 8 గ్రాములు , చెవి దిద్దులు 4 గ్రాములు మరియు రూ.50,000 నగదు దొంగిలించినట్లు తేలింది. ఈ రెండు కేసుల్లో నిందితుల వద్ద నుంచి రూ.45,000 నగదు, ఒక మొబైల్ ఫోన్, నల్లపూసల దండ 8 గ్రాములు, చెవి దిద్దులు 4 గ్రాములు కలిపి సుమారు రూ.2 లక్షల విలువైన ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైనది. అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను ఈరోజు గౌరవ దర్శి న్యాయస్థానం ముందు హాజరు పరచడం జరుగుతుంది. ఈ కేసులను ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన దర్శి సిఐ వై రామారావు, తాళ్లూరు ఎస్సై గా.మల్లికార్జునరావు, దొనకొండ ఎస్సై ఎల్.రామకృష్ణ, పోలీసు సిబ్బంది నాయక్, శ్రీను, గిరి, మహేష్, మాలకొండయ్యలను జిల్లా ఎస్పీ గారు అభినందించారు.

# డి 2 సెక్షన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

### – రూ. 6,17,600/-లు అపరాధ రుసుం వసూలు



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 09**

డి2 సెక్షన్ పరిధిలో గురువారం విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు జరిగాయి. ఈ తనిఖీలలో అధికారులు 33 బ్యాచ్ లుగా ఏర్పడి 1973 సర్వీసులు చెక్ చేశారు. అడిషనల్ లోడ్ క్రింద 102 సర్వీసులకు గాను, రూ. 5,67,600/- లు, మాల్ ప్రాక్టీస్ కింద రూ. 50,000/- లు మొత్ఉ రూ. 6,17, 600/-లు అపరాధ రుసుం వేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు విద్యుత్ శాఖ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మాకినేని హరిబాబు, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. హైమావతి, ఒంగోలు టౌన్ డిఈఈ కె.వి పాండురంగారావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజిలెన్స్ కె. వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.జి.నారాయణ, ఎం..వెంకటేశ్వర్లు,కే. కోటయ్య, ఒంగోలు డివిజన్ కు సంబంధించిన ఏ.ఈ లు, సబ్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తించాలి

### – ఎమ్మెల్యే దామచర్ల - కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో

### జిల్లాలో మొట్టమొదటి ఆంకాలజీ స్క్రీనింగ్ బస్‌కు శ్రీకారం





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 09**

క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం అత్యంత ముఖ్యమని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు పేర్కొన్నారు. గురువారం స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు చేతులమీదుగా ఆంకాలజీ స్క్రీనింగ్ ఆన్ వీల్స్ మొబైల్ బస్‌కు కిమ్స్ హాస్పిటల్స్ ప్రాంగణంలో ఘనంగా ఫ్లాగ్ ఆఫ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఈ స్క్రీనింగ్ బస్ ద్వారా ప్రజల్లో అవగాహన పెరగడంతో పాటు అనేక ప్రాణాలను రక్షించవచ్చని ఆయన పేర్కొన్నారు. కిమ్స్ హాస్పిటల్స్ ఈ విధమైన వినూత్న సేవలను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ఈ ప్రత్యేక బస్‌లో ఆధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్ తదితర క్యాన్సర్లను ముందస్తుగా గుర్తించే పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రకాశం జిల్లా ప్రజలకు క్యాన్సర్ ముందస్తు నిర్ధారణ సేవలను మరింత చేరువ చేయడానికి ఆంకాలజీ స్క్రీనింగ్ ఆన్ వీల్స్ మొబైల్ బస్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ మొబైల్ యూనిట్ ద్వారా గ్రామీణ, దూర ప్రాంతాల ప్రజలకు వారి నివాస ప్రాంతాల వద్దే క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రకాశం జిల్లా ప్రజలు ఈ సేవలను వినియోగించుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కిమ్స్ వైద్యులు కోరారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్స్ రీజినల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ వి.ప్రవీణ్ కుమార్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కె. అంకి రెడ్డి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టి. శ్రీ హరి రెడ్డి పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను పరిశీలించిన జాయింట్ కలెక్టర్

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 09**

ఒంగోలు నగరంలోని వెంకటేశ్వర కాలనీలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి పర్యటించారు. గురువారం గద్దలకుంట – 2 సచివాలయాన్ని కూడా సందర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( సర్ ) ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ, ఓటర్ల వివరాల డిజిటైజేషన్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఆర్డిఓ చంద్రశేఖర్ నాయుడు, మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఇతర అధికారులు ఉన్నారు.



# రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విశాఖ రాక

**విశాఖపట్నం, జూలై 9 పెన్ పవర్**

కేంద్ర రక్షణ శాఖా మంత్రి శ్రీ రాజ్ నాథ్ సింగ్ 10 తేది సాయంత్రం 6 గంటలకు వాయుమార్గం ద్వారా విశాఖపట్నం చేరుకుంటారు. రాత్రి .7 గంటల నుండి అధికారులతో, సెయిలరు ల సమావేశమవుతారు. 11వ తేది ఉదయం 9-50 గంటలకు నేవల్ డాక్ యార్డ్ లో "మహేంద్ర గిరి" కమిషనింగ్ సెరెమొనీ లో పాల్గొంటారు. అనంతరం విశాఖపట్నం నుండి వాయుమార్గం ద్వారా డిల్లీ వెళతారు.

# కాకినాడ రూరల్ మండల తహశీల్దార్‌గా

### పోతురాజు బాధ్యతలు స్వీకరణ

**కాకినాడ రూరల్ జూలై 9 పెన్ పవర్**

పశ్చిమ గోదావరి జిల్లాలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన సంబలదీవి పోతురాజు పదోన్నతి పొంది కాకినాడ రూరల్ తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఇటీవల ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయన కాకినాడ రూరల్ మండల కార్యాలయంలో తహశీల్దార్‌గా గురువారం బాధ్యతలు తీసుకున్నారు. పరిపాలనా అనుభవం కలిగిన పోతురాజు రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో సేవలు అందించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడంలో ఆయనకు మంచి అనుభవం ఉందని సహచర అధికారులు పేర్కొంటున్నారు. భూ సమస్యలు, ఆదాయ, కుల, నివాస ధృవపత్రాలు, రెవెన్యూ సంబంధిత ఇతర సేవల పరిష్కారంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందే అవకాశముందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ రూరల్ మండలంలో రెవెన్యూ పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, భూ వివాదాల పరిష్కారం, ప్రజా సమస్యల పరిష్కారంలో పోతురాజు ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని పోతురాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు మర్యాద పూర్వకంగా కలిశారు.

## సీత ప్రత్యేక శిక్షణ ముగింపు..

## పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు



**సింహాచలం, జూలై 9 పెన్ పవర్**

శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలోని కృష్ణాపురం గోశాలలో రాష్ట్ర దేవాదాయ శాఖ శిక్షణా సంస్థ నిర్వహించిన మూడు రోజుల 'సీత' ప్రత్యేక శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు శిక్షణలో సేవలందించిన నిపుణులను సన్మానించి, పాల్గొన్న వివిధ దేవాలయాల గోశాలల సిబ్బంది, ప్రతినిధులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. గోశాలల నిర్వహణలో శాస్త్రీయ విధానాలు, పరిశుభ్రత, పశువుల ఆరోగ్య సంరక్షణ, పంచగవ్య ఉత్పత్తుల ప్రోత్సాహంపై శిక్షణలో పొందిన అవగాహనను అమలు చేసి ఆదర్శ గోశాలలుగా తీర్చిదిద్దాలని వెంకట్రావు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాలయ గోశాలల అభివృద్ధికి ఇటువంటి శిక్షణలు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి మూలా వాసు, సీత సీనియర్ సహాయకులు లక్ష్మణస్వామి, గోశాల సిబ్బంది, వివిధ దేవాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పొగాకు రైతుల సమస్య పరిష్కారం పై ప్రత్యేక దృష్టి

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

### టంగుటూరు మండలం పొందూరు గ్రామంలో ' పల్లెనిద్ర ' కార్యక్రమం

### పాల్గొన్న జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి






**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 09**

పొగాకు రైతుల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాము. ప్రభుత్వ యంత్రాంగం ఈ సమస్యను నిశతంగా పరిశీలిస్తూ ఉన్నది. ధర విషయంలో పొగాకు రైతులందరికీ కచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తామని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు భరోసా ఇచ్చారు. గురువారం ఆయన జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారితో కలిసి టంగుటూరు మండలం పొందూరు గ్రామంలో ' పల్లెనిద్ర ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజలతో ముఖాముఖి చర్చించి వారి సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే ' పల్లెనిద్ర ' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మెరుగైన జీవనోపాధి కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ' మనమిత్ర ' వాట్సప్ సేవలు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ' కౌశలం ', విపత్తుల సమాచారాన్ని క్షణాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచే ' అవేర్ 2.0 ' ఆన్లైన్ పోర్టల్ గురించి స్వయంగా కలెక్టరే ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని గర్భిణులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. తల్లీబిడ్డ ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. అంగన్వాడీ, ఏ.ఎన్.ఎం.ల ద్వారా లభిస్తున్న సేవలను వినియోగించుకోవాలని, పోషకాహారం తీసుకుంటూ సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కాగా, వైద్యుల ద్వారా పొందుతున్న సేవలపై గర్భిణులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్.హెచ్.జి. రుణాలను మెరుగైన జీవనోపాధి కోసం వినియోగించుకుంటున్నామని స్వయం సహాయక సంఘాల మహిళలు చెప్పారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ' మన డబ్బులు – మన లెక్కలు ' వంటి యాప్ ల ద్వారా ఆర్థిక లావాదేవీలలో పారదర్శకత పెరిగిందని సంతోషం వ్యక్తం చేశారు.

**ఇవే ప్రధాన సమస్యలు...**

పొగాకు ధరలు తగ్గిపోకుండా చూడాలి. గ్రామంలోని, పరిసర చెరువుల అనుసంధానం కోసం చర్యలు తీసుకోవాలి. ఫలితంగా సాగు, త్రాగు నీటికి ఇబ్బంది ఉండదు. స్థానికంగా బ్రిడ్జిలు కావాలి. గ్రామకంఠానికి సంబంధించిన భూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి. గ్రామంలోని జాయింట్ ఎల్.పి.ఎం. సమస్యలను పరిష్కరించాలి. ఎస్సీ కాలనీలో మురుగనీటి సమస్య ఉన్నది. డ్రైనేజీ లేకపోవడం వలన మురుగునీరు పాఠశాల వద్ద నిల్వ ఉంటున్నది. ఈ స్కూలుకు ప్రహరీ గోడ కూడా లేదు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. శిథిలమైన అంగనవాడి స్థానంలో కొత్త భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. క్రిస్టియన్ పాలెంలో కట్టిన ఓవర్ హెడ్ ట్యాంకు నిరుపయోగంగా ఉన్నది. దీనిని అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలి. దాతలు ఇచ్చిన వాటర్ ప్లాంట్ ను మాజీ సర్పంచ్ అమ్ముకున్నారు. విచారించి చర్యలు తీసుకోవాలి. గ్రామస్తులు ప్రస్తావించిన సమస్యలను కలెక్టర్ ఓపికతో విన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి తక్షణమే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆర్థికేతర సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. స్థానికంగా అధిక విస్తీర్ణంలో పొగాకు సాగు చేయటం, అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా మన పొగాకు రైతులకు సమస్య ఎదురయిందన్నారు. కేంద్ర ప్రభుత్వము, పొగాకుబోర్డు నిర్దేశించిన విస్తీర్ణం మేరకే సాగు చేయాలని కలెక్టర్ చెప్పారు. ప్రస్తుతం పండించిన పంటను కంపెనీలు పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**'సర్' కు సహకరించాలి...**

ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( సర్) ప్రక్రియకు స్థానికులు అందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈనెల 14వ తేదీతో ఈ ప్రక్రియ ముగుస్తున్నందున ఓటర్ల ఆచూకీ తెలుసుకోవడంలో బిఎల్వోలకు స్థానికులు సహకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, జెడ్పీ సీ.ఈ.వో. చిరంజీవి, డిపిఓ అనుపమ, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సచివాలయాల జిల్లా అధికారి వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. దీనికి ముందుగా మండలంలోని అన్ని గ్రామాల్లో జిల్లా స్థాయి అధికారులు పర్యటించి స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పల్లె నిద్ర కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాగా, ఈ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తక్షణమే దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.

# 14వ తేదీ కి సర్ ప్రక్రియ పూర్తి చేయాలి - కేంద్ర ఎన్నికల సంఘం




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూలై 09**

కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, కందుకూరు సబ్ కలెక్టర్ డి.హిమవంశి, ఇతర నియోజకవర్గాల ఈఆర్వోలు పాల్గొన్నారు. ఈనెల 14వ తేదీ నాటికి ' సర్ ' పూర్తయ్యేలా చర్యలను వేగవంతం చేయాలని ఎలక్షన్ కమిషన్ ఆదేశించింది. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. మండల స్థాయిలో అదనపు ఏఈఆర్వోలతో ఈ ప్రక్రియను వేగవంతం చేయించాలని ఆదేశించారు.

# టాస్ విన్ రేట్ 100%.. మ్యాచ్ రిజల్ట్ 0%.. తొలి గెలుపు కోసం శ్రేయస్ వెయిటింగ్!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఇండియన్ క్రికెట్ చరిత్రలోనే ఎవరికీ సాధ్యం కాని ఒక విచిత్రమైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. టీ20 ఇంటర్నేషనల్స్‌లో కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన 5 మ్యాచ్‌ల్లోనూ అతను టాస్ గెలిచాడు. దీంతో టాస్ గెలుపులో 100 శాతం సక్సెస్ రేట్‌తో దూసుకుపోతున్నాడు. కానీ, దీని వెనుకే ఒక చేదు నిజం కూడా ఉంది. టాస్ గెలిచిన అన్ని మ్యాచ్‌ల్లోనూ (100% టాస్ విన్ రేట్) ఓడిపోయి, జీరో (0%) మ్యాచ్ విన్ రేట్ కలిగిన ఏకైక టీమిండియా కెప్టెన్‌గా కూడా శ్రేయస్ నిలిచాడు. ఐర్లాండ్ చేతిలో చారిత్రాత్మక సిరీస్ ఓటమితో సహా, కెప్టెన్‌గా ఆడిన గత 5 మ్యాచ్‌ల్లోనూ ఇండియా ఓడింది.

(గురువారం) బ్రిస్టల్ మైదానంలో ఇంగ్లాండ్‌తో జరగనున్న 4వ టీ20 మ్యాచ్ శ్రేయస్ అయ్యర్‌కు అత్యంత కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో కూడా టాస్ గెలిస్తే, వరుసగా 6 మ్యాచుల్లో టాస్‌లు గెలిచిన మహేంద్ర సింగ్ ధోనీ, విరాట్ కోహ్లీల ఆల్‌టైమ్ రికార్డును శ్రేయస్ సమం చేస్తాడు.

**ఎక్కువ టాస్‌లు గెలిచిన భారత టీ20 కెప్టెన్లు:**

6 – ఎంఎస్ ధోనీ (మే 2010 – ఫిబ్రవరి 2012)
6 – విరాట్ కోహ్లీ (ఆగస్ట్ 2019 – డిసెంబర్ 2019)
5 – రోహిత్ శర్మ (ఫిబ్రవరి 2020 – ఫిబ్రవరి 2022)
5 – ఎంఎస్ ధోనీ (సెప్టెంబర్ 2007)
5 – శ్రేయస్ అయ్యర్ (జూన్ 2026 – జూలై 2026)

**సిరీస్ ఓటమిని తప్పించుకోవాలనే కసిలో భారత్:**

ఐర్లాండ్ చేతిలో చరిత్రలోనే మొదటిసారి సిరీస్ ఓడిపోయిన భారత్..

ఇప్పుడు ఇంగ్లాండ్ చేతిలో కూడా మరో సిరీస్ పరాభవాన్ని మూటగట్టుకోకుండా ఉండాలంటే ఈ 4వ టీ20లో తప్పకుండా గెలవాల్సి ఉంది. ఈ మ్యాచ్ ద్వారా శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా తన మొదటి విజయాన్ని ఖాతాలో వేసుకోవాలని పట్టుదలతో ఉన్నాడు.

**ఇరు జట్ల స్క్వాడ్స్:**

**భారత జట్టు:** అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), సంజు శాంసన్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, వాషింగ్టన్ సుందర్

**ఇంగ్లాండ్ జట్టు:** ఫిలిప్ సాల్ట్, జోస్ బట్లర్ (వికెట్ కీపర్), హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జాకబ్ బెథెల్, టామ్ బాంటన్, సామ్ కరన్, విల్ జాక్స్, జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్

# రంగారెడ్డి ఔట్.. క్వాలిఫయర్-2 టికెట్ కన్ఫర్మ్ చేసుకున్న కరీంనగర్ డైమండ్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రీమియర్ (టిజీ20) లీగ్-2026లో భాగంగా ఉప్పల్ వేదికగా రంగారెడ్డి రైజర్స్ తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో కరీంనగర్ డైమండ్స్ జట్టు 75 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో కరీంనగర్ జట్టు క్వాలిఫైయర్-2కి అర్హత సాధించింది. ఇక టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ తీసుకున్న కరీంనగర్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 5 వికెట్ల నష్టానికి 238 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. కరీంనగర్ కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ భారీ సెంచరీతో జట్టును ముందుకు నడిపించాడు. అతడు కేవలం 61 బంతుల్లోనే 11 ఫోర్లు, 10 సిక్సర్లతో 137 రన్స్ చేశాడు. ఈ టీజీ20 లీగ్‌లో తన్మయ్‌కి ఇది మూడో సెంచరీ కావడం విశేషం.

**రాణించిన సింహా.. రంగారెడ్డి బౌలింగ్ విఫలం:**

తన్మయ్‌తో పాటు వైస్ కెప్టెన్ సింహా హాఫ్ సెంచరీ (50 పరుగులు)తో రాణించాడు. వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు కేవలం 69 బంతుల్లోనే 139 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కాగా రంగారెడ్డి బౌలర్లలో అర్భజ్ కరీముద్దీన్ రెండు వికెట్లు పడగొట్టగా.. అరుణ్ కుమార్, కెప్టెన్ వినయ్ త్యాగరాజన్, సుకేత్, నితిన్ సాయి యాదవ్ తలో ఒక వికెట్ తీసుకున్నారు.

**చేతులెత్తేసిన రంగారెడ్డి బ్యాటర్లు:**

239 పరుగుల భారీ లక్ష్య ఛేదన కోసం బరిలోకి దిగిన రంగారెడ్డి రైజర్స్ జట్టు కేవలం 16.3 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది. అయితే కరీంనగర్ స్పిన్నర్ అమిత్ శర్మ తన అద్భుత బౌలింగ్‌తో రంగారెడ్డి బ్యాటింగ్ ఆర్డర్‌ను దెబ్బకొట్టాడు. అతను 3.3 ఓవర్లలో కేవలం 16 రన్స్ మాత్రమే ఇచ్చి 5 వికెట్లు తీసుకుని కరీంనగర్‌కు విజయాన్ని అందించాడు. అమిత్‌తో పాటు రూపేష్ వర్మ కూడా 2 వికెట్లు సొంతం చేసుకున్నాడు.

అయితే రంగారెడ్డి రైజర్స్ జట్టు బ్యాటర్లలో కెప్టెన్ వినయ్ త్యాగరాజన్ (33 బంతుల్లో 63), నితిన్ సాయి యాదవ్ (50) హాఫ్ సెంచరీలతో ఒంటరి పోరాటం చేసినప్పటికీ జట్టును మాత్రం గెలిపించలేకపోయారు. మిగిలిన బ్యాటర్లు ఎవరూ పెద్దగా రాణించకపోవడంతో రంగారెడ్డికి ఈ ఘోర ఓటమి తప్పలేదు. ఈ పరాజయంతో రంగారెడ్డి ఇంటికి వెళ్లిపోయింది.

## 2027 వరల్డ్ కప్ కోసం పాక్ ప్రిపరేషన్ షురూ.. కొత్త టోర్నీతో బిగ్ ప్లాన్!




**హైదరాబాద్ పెన్ పవర్:** వరుస పరాజయాలతో సతమతమవుతున్న పాకిస్తాన్ క్రికెట్ బోర్డు వచ్చే ఏడాది సౌతాఫ్రికా వేదికగా జరగబోయే 2027 వన్డే ప్రపంచకప్ కోసం ఇప్పటి నుంచే మైండ్ గేమ్ షురూ చేసింది. ఎలాగైనా ఒక పటిష్టమైన పాక్ జట్టును రెడీ చేసేందుకు, వచ్చే ఏడాది ఆగస్టులో సరికొత్త డొమెస్టిక్ టోర్నమెంట్‌కు శ్రీకారం చుట్టబోతోంది. దేశవాళీ ఫస్ట్ క్లాస్ సీజన్ కంటే ముందే ఈ 50 ఓవర్ల టోర్నీ జరగనుందని ఈ టోర్నీలో నాలుగు జట్లు తలపడనున్నాయి. వరల్డ్ కప్‌కు ఇంకా కేవలం 18 నెలల సమయం మాత్రమే ఉంది, కాబట్టి ప్రిపరేషన్స్ మొదలు పెట్టడానికి ఇదే రైట్ టైమ్ అని ఆకిబ్ జావేద్ తెలిపారు. పాక్ వైట్-బాల్ ప్లేయర్లు అందరూ ఇందులో ఆడటం కంపల్సరీ. సెలెక్టర్లు, కోచ్‌లు కలిసి ప్రతి ప్లేయర్‌కు ఒక నిర్దిష్టమైన రోల్ ఇచ్చి మరీ మైదానంలోకి దించనున్నారని పేర్కొన్నాడు.

**టాప్-4లో లేకపోతే ఒప్పుకునే ప్రసక్తి లేదు:**

పాకిస్తాన్‌లోని ప్రైమ్ అండ్ రైజింగ్ స్టార్స్ ఆడే ఈ టోర్నీని ఫ్యాన్స్ కోసం లైవ్ బ్రాడ్‌కాస్ట్ చేయనున్నారు. ఈ టోర్నమెంట్ ద్వారా వరల్డ్ కప్‌కు కిరాక్ ప్లేయర్లు దొరుకుతారని పీసీబీ మేనేజ్‌మెంట్ నమ్ముతోంది. ప్రపంచ వన్డే ర్యాంకింగ్స్‌లో పాక్ టీమ్ ఖచ్చితంగా టాప్-4 లో ఉండాలని, అంతకంటే తక్కువ వస్తే అస్సలు ఒప్పుకునేది లేదని ఆకిబ్ జావేద్ టార్గెట్ సెట్ చేశారు.

**ఈసారి సెమీస్ బెర్తు టార్గెట్:**

పాకిస్తాన్ జట్టు గత 3 వన్డే ప్రపంచకప్‌లలో కనీసం సెమీఫైనల్‌కు కూడా క్వాలిఫై అవ్వలేదు.. పైగా ఇటీవలి టీ20 వరల్డ్ కప్‌లలో కూడా ఘోరంగా విఫలమవడంతో పాటు ప్రస్తుతం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలోనూ చివరి స్థానంలో నిలిచింది. పరువు కాపాడుకోవడానికైనా ఒక స్థిరమైన వన్డే జట్టును తయారు చేసుకోవాలని దాయాది దేశం ఆశిస్తోంది. అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21 మధ్య జరిగే వరల్డ్ కప్‌కు ముందే ఈ టోర్నీ ముగియనుంది.

# బాలీవుడ్ కంటే టాలీవుడ్‌కే సోనాలి బింద్రే ఫుల్ మార్క్స్



సాంప్రదాయక ఎత్నిక్ గ్లామర్‌కు నిలువుటద్దంలా నిలిచిన జాన్వీ కపూర్



బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఒక వెలుగు వెలిగినప్పటికీ, టాలీవుడ్ గురించి మాట్లాడాల్సి వస్తే తన అభిప్రాయం ఏమాత్రం దాచుకోనని నటి సోనాలి బింద్రే స్పష్టం చేశారు. రెండు పరిశ్రమల్లో పనిచేసిన అనుభవంతో ఆమె చేసిన తాజా కామెంట్స్ ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా టాలీవుడ్ పనితీరు, ప్లానింగ్, ప్రొడక్షన్ వాల్యూస్ పై ఆమె వ్యక్తం చేసిన అభిప్రాయాలు టాలీవుడ్ కు మరోసారి ప్రశంసలు తీసుకొచ్చాయి. టాలీవుడ్ లో పని చేసే విధానం చాలా క్రమబద్ధంగా ఉంటుందని, సినిమా ప్రారంభానికి ముందే కథ, స్క్రీన్‌ప్లే, షూటింగ్ ప్లాన్ వంటి అంశాలు క్లియర్ గా రెడీగా ఉండటం వల్ల షూటింగ్‌లు అనుకున్న టైమ్‌కే పూర్తవుతాయని ఆమె పేర్కొన్నారు. ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయడం వల్ల సెట్స్‌పై గందరగోళం తక్కువగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. అదే సమయంలో బాలీవుడ్ లో కొన్ని సందర్భాల్లో కథ లేదా సన్నివేశాల్లో చివరి నిమిషంలో మార్పులు చోటుచేసుకోవడం సాధారణమని, దీంతో షూటింగ్ షెడ్యూల్స్‌పై ప్రభావం పడుతుందని ఆమె వివరించారు. టాలీవుడ్‌లో మాత్రం ముందస్తు ప్రణాళికకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం నిర్మాతలు, డైరెక్టర్లు, నటీనటులందరికీ సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. ప్రొడక్షన్ వాల్యూస్ విషయంలో కూడా తెలుగు సినిమాలు గత కొన్నేళ్లుగా భారీ స్థాయిలో అభివృద్ధి సాధించాయని సోనాలి అభిప్రాయపడ్డారు. కథకు తగ్గట్టుగా ఖర్చు పెట్టడంలో నిర్మాతలు వెనుకాడరని, టెక్నికల్ వాల్యూస్ కూడా అంతర్జాతీయ స్థాయికి చేరుకున్నాయని ఆమె పేర్కొన్నారు. సెట్స్‌లో కళాకారులు, టెక్నీషియన్ల పట్ల చూపించే గౌరవం, ఆతిథ్యం కూడా టాలీవుడ్ ప్రత్యేకతల్లో ఒకటిగా ఆమె చెప్పారు. తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న సోనాలి, తాను నటించిన సినిమాలే ఇప్పటికీ తనను తెలుగు అభిమానులకు దగ్గరగా ఉంచాయని అన్నారు. కెరీర్‌లో చేసిన క్యారెక్టర్ల ద్వారా లభించిన ఆదరణను ఎప్పటికీ మర్చిపోలేనని ఆమె పేర్కొన్నారు. గ్లామర్‌కే పరిమితం కాకుండా యాక్టింగ్ కు అవకాశం ఉన్న క్యారెక్టర్లు కూడా తెలుగు సినిమాల్లో దక్కడం తనకు ప్రత్యేక అనుభూతినిచ్చిందని తెలిపారు. పర్సనల్ లైఫ్ లో క్యాన్సర్‌తో పోరాడి సక్సెస్‌ఫుల్‌గా కోలుకున్న తర్వాత, ఇప్పుడు ఎంపిక చేసిన పాత్రలతోనే ప్రేక్షకుల ముందుకు వస్తున్న సోనాలి బింద్రే, మంచి కథ, బలమైన పాత్ర దొరికితే మరోసారి తెలుగు సినిమాలో నటించేందుకు సిద్ధమేనని సంకేతాలిచ్చారు. ఆమె కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, టాలీవుడ్ అభిమానులు ఆమె రీఎంట్రీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



అద్భుతమైన రోజ్-పింక్ లేస్ చీరలో రిద్ధి కుమార్ అపురూపమైన హుందాతనం

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com